

# దళిత సాధికారత

DBRC News Letter

DALIT BAHUJAN RESOURCE CENTRE

April - September, 2023 | For private circulation only | Volume - 7 • Issue - 14



## సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపు, ఖర్చు పర్యవేక్షించేందుకు దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కమిటీ ఆవిర్భావం

Budget watch

**రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం కాల పరిమితిరి మరో 10 సంవత్సరాల పాటు పొడిగించడం హర్షనీయమని, అయితే ఆ నిధులను ఆయా వర్గాల ప్రత్యేక సంక్షేమం, అభివృద్ధి పథకాలకు కేటాయించి ఖర్చు పెట్టాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కమిటి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.**

గుంటూరు బ్రాడీపేటలోని హోటల్ సింధూరి లో జులై 11న రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ అధ్యక్షతన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధే ధ్యేయంగా రూపొందించిన ఈ చట్టం అనుకున్నంత మేర తన లక్ష్యాన్ని చేరుకోలేదని, దీన్ని ప్రభుత్వం కూడా అంగీకరించడం వలనే చట్టాన్ని మరో 10 సంవత్సరాలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ చట్టం వల్ల ఎస్సీ, ఎస్టీ కులాల్లో మార్పు తీసుకొని రావడంతో ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు. జనాభా ప్రాతిపదికన ఏ ఆర్థిక సంవత్సరం నిధులు కేటాయించలేదని మరియు కేటాయించిన అరకొర నిధులను సక్రమంగా ఖర్చు చేయలేకపోయారని అన్నారు. గత 8 సంవత్సరాల్లో ఎస్సీ, కాంపోనెంట్‌లో87689 కోట్లు కేటాయిస్తే అందులో కేవలం 67413 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. ఎస్టీ, కాంపోనెంట్ లో 30184 కోట్లు కేటాయిస్తే అందులో 23791 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు.

ఉప ప్రణాళికా చట్టం 2013 కాల పరిమితి 2023తో పది సంవత్సరాల కాలం పూర్తయిన సందర్భంగా దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కమిటీ సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు మరియు ప్రభుత్వ సలహాదారులకు ఈ చట్టాన్ని మరింత ధృఢపరచి ప్రతి ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందేవరకు కొనసాగించాలని చేసిన ప్రయత్నాల కారణంగా ప్రభుత్వం **జీ.ఒ.యం.యస్.నం.91**ను తీసుకొని వచ్చి ప్రభుత్వం లోని కొంతమంది ప్రజా ప్రతినిధులను మరియు ప్రభుత్వ కార్యదర్శులను సభ్యులుగా ఉప ముఖ్యమంత్రి

శ్రీ రాజన్న దొర ఆధ్వర్యంలో 19 మందితో కూడిన కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి దళిత ఆదివాసీ నాయకులను, సంఘాలను, స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి వారి సూచనలను మరియు సలహాలను తీసుకొని ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ చట్టాన్ని మరింత బలపరచాలని ప్రభుత్వం సూచించింది అని దేవకుమార్ తెలిపారు.

**శ్రీకృష్ణదేవరాయ విశ్రాంత ప్రొఫెసర్ భావయ్య** మాట్లాడుతూ..

ఎస్సీ, ఎస్టీ చట్టం 2013 లో జనాభా ప్రాతిపదికన నిధుల్ని కేటాయించాలని, కేటాయించిన నిధులను ఖచ్చితంగా ఖర్చు చేయాలని చట్టంలో ఉందని కానీ ప్రభుత్వ అధికారులు చట్టాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక నిర్లక్ష్యంగా ఉండడం వల్ల చట్టం యొక్క ప్రాధమిక లక్ష్యం నెరవేరటం లేదని అభిప్రాయపడ్డారు.



సబ్‌ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి ప్రతి జిల్లాలో జిల్లా కమిటీలు వేసి పర్యవేక్షించాలని అందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక ఉన్నత అధికారిని నియమించాలని అన్నారు.

దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ జిల్లా కమిటీలను మరింత బలంగా రూపొందించి ప్రతి గ్రామంలోని యువతీ యువకులకు ఈ చట్టం యొక్క ప్రాధాన్యతను తెలిసేలా కృషి చేయాలని అన్నారు.

**డిబిఎస్‌యు రాష్ట్ర ప్రతినిధి చిట్టిబాబు** మాట్లాడుతూ..

దేశంలో ఏ చట్టానికి కాల పరిమితి లేదని, ఒక్క ఎస్సీ, ఎస్టీ చట్టానికి మాత్రమే కాల పరిమితి నిర్ణయించడం చాలా అవమానం అని, 75 సంవత్సరాల భారత దేశంలో ఇంకా పేదలు అణగారిన వర్గాలు కనీస అవసరాలు కూడా పొందలేకపోతుంటే కేవలం 10 సంవత్సరాల్లో దళితుల బ్రతుకుల మార్చేస్తామని చెప్పడం చాలా ఆశ్చర్యకరం అన్నారు. ఒకవేళ ఈ తక్కువ సమయంలో మార్చితే అంతకు మించిన సంతోషం కూడా లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం సక్రమంగా అమలు జరగాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన



## ప్రతిపాదనలు

1. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం 2013 కు విధించిన 10 సంవత్సరాల కాల పరిమితితో సంబంధం లేకుండా ఎస్సీ, ఎస్టీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేత వరకు కొనసాగించాలి.
2. సబ్‌ప్లాన్ చట్టం పేరును ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి చట్టంగా మార్చాలి.
3. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకుండా మిగిలిపోయిన నిధులను మరుసటి సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్‌కు అదనంగా కలిపి ఖర్చు చేయాలి.
4. 2014-15 నుండి 2022-23 ఆర్థిక సంవత్సరాల కాలంలో ఖర్చు పెట్టిన సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ నిర్వహించాలి మరియు ఎస్సీ, ఎస్టీలలో వచ్చిన మార్పుపై అధ్యయనం చేయాలి.
5. సబ్‌ప్లాన్ అమలు కొరకు ప్రత్యేకంగా యంత్రాంగాన్ని నియమించాలి.
6. సబ్‌ప్లాన్ ద్వారా అమలు చేస్తున్న పథకాల రూపకల్పనలో ఆయా వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలి.
7. సబ్‌ప్లాన్ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను గూర్చి ఆయా శాఖలు ఎస్సీ, ఎస్టీ ప్రజలకు అవగాహన కల్పించాలి.

**కార్యాచరణ ప్రణాళిక:**

1. ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో జరుగుతున్న సంక్షేమ పథకాల గురించి అధ్యయనం చేయాలి. వాటిని మన రాష్ట్రంలో అమలు జరిగేలా ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వాలి.
2. సబ్‌ప్లాన్‌ను శక్తివంతం చేసేందుకు జి.ఒ.యం.యస్.నం. 91 ద్వారా ప్రభుత్వం నియమించిన కమిటీలోని సభ్యులకు బడ్జెట్‌వాచ్ ప్రతిపాదనలను అందజేసి చర్చించాలి.



ఆశయాలను ఆచరణలో పెడితే మనిషి మహనీయుడు అవుతాడు. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

## దళిత గిరిజన బడ్జెట్‌వాచ్

### ముఖ్య ఉద్దేశ్యం

**బడ్జెట్ విశ్లేషణ:** ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద కేటాయించిన బడ్జెట్‌ను సమీక్షించడంతోపాటు ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రూపొందించిన వివిధ పథకాల అమలు కోసం నిర్దేశించిన నిధులను సమీక్షించడం.

**ఖర్చులను ట్రాక్ చేయడం:** వివిధ పథకాల అమలు కోసం కేటాయించిన నిధుల్లో వాస్తవ వ్యయాన్ని పరిశీలించడం..నిధుల కేటాయింపు, ఆయా కార్యక్రమాల వల్ల ఒనగూరే ప్రయోజనాలను విశ్లేషించడం, నిధుల వ్యయంలో తేడాలను గమనిస్తే ఆ విషయాలను నిర్దిష్టంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళటం.

- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల వల్ల ఆయా వర్గాల జీవన స్థితిగతుల్లో వస్తున్న మార్పులను అంచనా వేయడంతోపాటు క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరు ఎలా ఉందో ప్రత్యక్షంగా తెలుసుకోవడం, ఆశించిన ఫలితాలు ఏ మేరకు వచ్చేయో అధ్యయనం చేయడం. పథకాలు మరింత సమర్ధవంతంగా అమలయ్యేందుకు తగిన సిఫార్సులు చేయడం.
- ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రజలకు ఆయా పథకాల ప్రయోజనాలు అందేలా చూడడం..నిధుల కేటాయింపు, పథకాల అమలులో ఏవైనా అవకతవకలు గమనిస్తే దిద్దుబాటుకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్దిష్టంగా నివేదికలు రూపొందించి అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం.

### భాగస్వామ్య పక్షాల సమన్వయం

- ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంధ సంస్థలు, పౌర సంఘాలతో కలిసి పనిచేయడం.. ఎస్సీ కాంపోనెంట్ నిధుల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, వాటి లక్ష్యాలను చేరుకోవటానికి అవసరమైన చర్యలపై తరచూ సమావేశాలు, సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించడం.
- బడ్జెట్ విశ్లేషణలు నిర్వహించడం..బడ్జెట్‌పై భాగస్వామ్య పక్షాల ఆలోచనలను అభివృద్ధి చేయడం.
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అమలవుతున్న ముఖ్యమైన పథకాలపై తరచుగా అధ్యయనాలు నిర్వహించడం.
- అట్టడుగు వర్గాల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పథకాల రూపకల్పన కోసం అవసరమైన సూచనలు చేయడం.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు బడ్జెట్ కేటాయింపులో న్యాయం చేకూరేలా విధాన నిర్ణేతలతో చర్చించడం.

ప్రతి 6 నెలలకు ఒక సమావేశం ఖచ్చితంగా జరిగేలా ప్రయత్నం చేయాలని, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కులం ప్రాతిపదికన కేటాయిస్తే ఎక్కువ మంది దళిత ఆదివాసీలకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

**డా॥ ఉమా మహేశ్వరరావు** మాట్లాడుతూ..

ప్రభుత్వాలు చట్టాలు చేసినప్పటికీ అవి నామమాత్రంగానే మిగిలిపోతున్నాయని, మనమే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చి, మన హక్కులు పొందేలా కృషి చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కొరకు ఒక చట్టం చేస్తే బాగుంటుందని 1970 లో అప్పటి జాతీయ ప్రభుత్వం ఆలోచన చేస్తే, దేశంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013 లో చట్టం చేసిందని అన్నారు. అంటే దాదాపు 40 సంవత్సరాలు కాలం ఒక చట్టం తేవటానికి పట్టింది అంటే ఎస్సీ, ఎస్టీలంటే ప్రభుత్వాలకు ఎంత చిన్నచూపో మనము అర్థం చేసుకోవచ్చని అన్నారు.

ఈ కార్యక్రమంలో కెవిపిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్రా మాల్యాద్రి, ఆదివాసీ మిత్ర ప్రతినిధులు మన్మధరావు, వెల ంగు ప్రతినిధి సంజీవరావు, ఆల్ ఇండియా రేడియో ఎస్సీ, ఎస్టీ ప్రతినిధి సి.హెచ్. మాణిక్యరావు, ఆంధ్ర లయోలా కళాశాల ప్రతినిధులు ఫాదర్ ఎ.ఎక్స్.జె. బోస్కో, జాన్, ఎల ర్ట్ ప్రతినిధి వై.ఎల్. జయరాజ్, ఆదివాసీ మహాసభ ప్రతినిధి సూర్యనారాయణ, మేడ్ రాష్ట్ర అధ్యక్షులు దేవపాల్, నవజీవన్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి, అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ నుండి డా॥ రమేష్ బాబు పారా, దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ డా॥ రమణమూర్తి, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ హేమలత ఎమ్.,రీజనల్ కోఆర్డినేటర్లు దార్ల కోటేశ్వరరావు, మల్లెల చిన్నప్ప, పి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు. *

# దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ సమావేశములు

**దళిత గిరిజనుల ఆర్థిక స్వావలంబనకూ, సామాజిక అభ్యున్నతికి దోహదం చేసే ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక (సబ్‌ప్లాన్) చట్టాన్ని శాశ్వత ప్రాతిపదికపై అమలు చేసేందుకు దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. చట్టాన్ని మరో పదేళ్ళు పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ ను జారీ చేయడం తొలి విజయం. ఆర్డినెన్స్ రావటంతోనే సబ్‌ప్లాన్ ఫలితాలు దళిత గిరిజనులకు చేరడంలేదు. సబ్‌ప్లాన్ ఆకాంక్ష ఆచరణ రూపం దాల్చాలంటే చట్టాన్ని సమర్థవంతంగా, పారదృకంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అన్ని రంగాల్లో వెనుకబడిన దళిత గిరిజన సంక్షేమానికి, అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలిచే సబ్‌ప్లాన్ చట్టం ప్రయోజనాలను నూటికి నూరుశాతం దళజత గిరిజనులు అందిపుచ్చుకునేలా, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేందుకు చేయాల్సిన కృషిపై దళిత గిరిజన బడ్జెట్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తోంది.**




- **ప్రణాళికాబద్ధంగా సబ్‌ప్లాన్ అమలు చేయాలి**
- **దళిత గిరిజనుల అభివృద్ధికే నిధులు కేటాయించాలి**
- **ప్రభుత్వమే సంపూర్ణ బాధ్యత వహించాలి**

**- అల్లడి దేవకుమార్**
రాష్ట్ర కన్వీనర్, దళిత గిరిజన బడ్జెట్‌వాచ్

## బాపట్ల జిల్లా

దళిత గిరిజన ఉప ప్రణాళిక (సబ్‌ప్లాన్) ఉద్దేశ్యాలనూ, ప్రయోజనాలను ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ అన్నారు.

బాపట్లలోని ఎన్జీవో హోం లో నిర్వహించిన దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో దేవకుమార్ మాట్లాడుతూ దళిత గిరిజన సబ్‌ప్లాన్ వల్ల ఆయా వర్గాలకు సామాజిక స్వాంతన, ఆర్థిక స్వావలంబన చేకూరుతుందన్నారు. సబ్‌ప్లాన్ ప్రయోజనాలు అందాల్సిన వారిని గుర్తించి ప్రణాళికలు రూపొందించి చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని దేవకుమార్ అన్నారు. చట్టం బలోపేతంగా ఉండటమే కాదు అమలు కూడా అంతే బలోపేతంగా ఉన్నప్పుడే ఆయా వర్గాలకు ప్రయోజనాలు ఒనగూరుతాయన్నారు. చట్టాన్ని రూపకల్పన చేసిన ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా దాన్ని అమలు చేసే బాధ్యతను కూడా చిత్తశుద్ధితో నిర్వహించాలని దేవకుమార్ కోరారు.

ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి. కృష్ణమోహన్ మాట్లాడుతూ సబ్‌ప్లాన్‌పై దళిత గిరిజనులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి నిధులను పూర్తి స్థాయిలో వారి ప్రయోజనాలకు వినియోగించాలన్నారు. మాల మహానాడు


కులం పునాదుల మీద దేనినీ సాధించలేం.. ఒక జాతిని, నీతిని నిర్మించలేం. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను దారి మళ్ళించకుండా వినియోగిస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో గిరిజన హక్కుల పోరాట సమిగి రాష్ట్ర అధ్యక్షులు యాకసిరి నరసింహరావు దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కో–ఆర్డినేటర్ డా॥ బి. రమణమూర్తి, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిన కోటేశ్వరరావు, అంబేద్కర్ రిస్ట్ విజయ్‌రాజు, విసికె పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ బాపట్ల సిటీ కో–ఆర్డినేటర్ కనమల సరోజినీ, అద్దంకి నియోజకవర్గ ఏరియా కో–ఆర్డినేటర్ పుటిపాటి వీరయ్యతో పాటు వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. *




## పల్నాడు జిల్లా (నరసరావుపేట)

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం పటిష్టంగా అమలయ్యేలా దళిత, ఆదివాసీలందరూ సమిష్టిగా కృషి చేయాలని దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎన్జీవో హోంలో నిర్వహించిన దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్నాడు జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. సమావేశంలో దేవకుమార్ మాట్లాడుతూ ఏడు దశాబ్దాలకు పైబడిన స్వతంత్ర భారత దేశంలో ఎన్నో పేదరిక నిర్మూలన పథకాలు అమలైనా అవి సామాజికంగా, ఆర్థికంగా అట్టడుగున జీవిస్తున్న దళిత గిరిజనుల జీవితాల్లో ఎలాంటి మౌలిక మార్పులు తీసుకురాలేకపోయాయని అన్నారు. అంటరానితనాన్ని అనుభవిస్తూ ఊరవతల వాడల్లో జీవిస్తున్న దళిత గిరిజనుల అసమానతలు కొంతయినా తొలగిపోయేందుకు దోహదపడే సబ్‌ప్లాన్‌ను సద్వినియోగం చేసుకునేందుకు అసమానతలు కొంతయినా తొలగిపోయేందుకు దోహదపడే సబ్‌ప్లాన్‌ను సద్వినియోగం చేసుకునేందుకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రముఖ న్యాయవాది, పల్నాడు జిల్లా సీ.ఎస్.టీ మానిటరింగ్ సభ్యుడు మల్లెల అశోక్ మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వేరే పనులకు మళ్ళించకూడదు అని, ఏవైనా నిధులు మిగిలితే వాటిని తరువాత సంవత్సరం నిధులకు జోడించాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్ఆర్‌పీఎస్ అధ్యక్షులు అడపా మోహన్, జనజాగృతి మండలి అధ్యక్షురాలు పిడతల రమాదేవి, దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ డా॥ రమణమూర్తి, డిబిఆర్‌సి మహిళా నాయకులు మేడే వెంకట రమణ, కోటిరత్నంతో పాటు వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. *

## గుంటూరు జిల్లా

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు చంద్రా నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక అరండల్‌పేట లో ఉన్న ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల భవనంలో నిర్వహించిన దళిత గిరిజన




బడ్జెట్‌వాచ్ జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రనాయక్ మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులు శాఖల వారీగా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధికే వినియోగించాలని అన్నారు. దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ ఎమ్. హేమలత, డా॥ బి. రమణమూర్తి, దాసరి థామస్, చంద్రశేఖర్, భగవాన్ దాస్, రమేష్, రవితేజ, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు. *

---




## ఏలూరు జిల్లా

దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగింపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది శాసన సభ్యులను కలిసి వినతి పత్రాలు అందించినట్లు దళిత బహుజన రిసోర్స్ సెటర్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డా॥ బి. రమణమూర్తి తెలిపారు. కమిటీ చేసిన విశేష కృషి వల్లనే సబ్‌ప్లాన్‌ను మరో పది ఏళ్ళు పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ సమావేశానికి ఏలూరు జిల్లా దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కమిటీ కన్వీనర్ శింగవరపు జ్యోతి అధ్యక్షత వహించారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ పి. రమాదేవి, డిబిఆర్‌సి ప్రతినిధులు గోశాల ఝాన్సీరాణి, భలే సతీష్, ఎన్. లక్ష్మీకుమారి, ప్రభ, రాజేశ్వరరావు, జీవమణి, మేరి కమల, కిరణ్‌కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. *

---

## విజయవాడ

ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుల వల్లనే ఎస్సీ, ఎస్టీల ఆర్థిక అభ్యున్నతికి దోహదపడుతుందని దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డా॥ బి. రమణమూర్తి అన్నారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ జామి రమాదేవి మాట్లాడుతూ స్టేట్ కౌన్సిల్ ఫర్ డెవలప్‌మెంట్, సాంఘిక సంక్షేమ శాఖల


వినయం, శీలం లేని విద్యావంతుడు మృగం కంటే ప్రమాదకరం. - డా॥ బి. ఆర్. అంబేద్కర్




ఆధ్వర్యంలో ఉప ప్రణాళిక చట్టం అమలు పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించటంతోపాటు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో దళితి రైట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి ప్రకాష్, మాల మహానాడు జిల్లా ప్రతినిధి బాబు, బహుజన సమాజ్‌పార్టీ జిల్లా ప్రతినిధి మోజెస్, ఎస్టీ కుల నాయకులురంగారావు, డిబిఆర్‌సి ఏరియా కో–ఆర్డినేటర్ మల్లేశ్వరి, బెంజిమన్, ఏకుల రవి తదితరులు పాల్గొన్నారు. *

---




## ఒంగోలు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను చిత్తశుద్ధితో వినియోగించడం ద్వారా ఆయా వర్గాల ఆర్థిక, సామాజిక ఉన్నతికి పాటుపడాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వంపై ఉందని దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ అన్నారు. ఒంగోలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో దశాబ్దాలుగా అమలులో ఉన్న పేదరిక నిర్మూలన పథకాలు సమాజంలో అట్టడుగున నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీల ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగించలేకపోతున్నాయి. ఈ దశలో సబ్‌ప్లాన్ వారిలో కొత్త వెలుగులు నింపేందుకు అవకాశం ఉందని, ప్రభుత్వం చట్టాన్ని పటిష్టంగా క్షేత్రస్థాయిలో అమలు చేయగలిగినప్పుడే అది సాధ్యపడుతుందని దేవకుమార్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కరవది సుబ్బారావు మాట్లాడుతూ పంచవర్ష ప్రణాళికలో అంతర్భాగంగా ఉన్న సబ్‌ప్లాన్ నిధులను వేరే పనుల కోసం మళ్ళించకూడదన్నారు. ఈ సమావేశంలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి రఘురాం, జైభీమ్ పాంథర్స్ జిల్లా అధ్యక్షులు పాలడుగు రమేష్, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి బిల్లా శరత్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు బాల సుందరం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా పాలెపోగు డగ్లస్, తాళ్లూరు కోటేశ్వరరావు, శాంతరాజ్, డీపీఆర్ ప్రసాద్, చప్పిడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. *




### రాష్ట్ర వ్యాప్తంగా

# డా. బి.ఆర్. అంబేడ్కర్ జయంతి మహోత్సవములు

- వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు - డిబిఆర్‌సి ఆధ్వర్యంలో ఘన నివాళులు
- అసమానతలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయం - దళిత బహుజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతే లక్ష్యం
- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో తమ వాణి వినిపించిన డిబిఆర్‌సి

## గుంటూరు జిల్లాలో..

చీకట్లు కమ్మిన దళిత బహుజనుల జీవితాల్లో వెలుగురేఖలు ప్రసరింపచేసిన అణగారిన వర్గాల ఆశాదీపం, రాజ్యాంగ రచనా శిల్పి, ఆత్మగౌరవ ఆలంబన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలను దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గుంటూరు జిల్లాలో నిర్వహించిన జయంతి వేడుకల్లో డిబిఆర్‌సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లడి దేవకుమార్ మాట్లాడుతూ దళిత బహుజనుల స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం పోరాడిన మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఈ దేశానికి మణిహారం లాంటి మహోన్నతుడు, దళిత బహుజను జీవితాల్లో వెలుగులు ప్రసరింపచేసేందుకు జీవితాంతం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి చట్టాలు రూపకల్పన చేసిన అంబేడ్కర్ జయంతి సందర్భంగా పౌర సమాజం అసమానతల ం లేని సమాజం కోసం ప్రతిన బూనాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ శామ్యూల్ అనిల్‌కుమార్, దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ కమిటీ కో-ఆర్డినేటర్ డా॥ రమణమూర్తి, ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మి, ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ హేమలత, ఇతర సభ్యుల ం కస్తూరి, విజయలక్ష్మి, జయలక్ష్మి, రమేష్, రవితేజ, సురేష్, ధనరాజ్ తదితరులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గుంటూరు లోని వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో డిబిఆర్‌సి ఆధ్వర్యంలో అంబేడ్కర్ అరుదైన చిత్రాలతో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ సేకరించిన ఫొటోలను డిబిఆర్‌సి ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ నుంచి నేటి యువత స్ఫూర్తి పొందాలన్నారు. మానవ వికాసానికీ, అంతరాలు లేని సమాజ స్థాపనకు అంబేడ్కర్ చూపించిన మార్గంలో పయనించాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫొటో ఎగ్జిబిషన్‌లో అంబేడ్కర్ అరుదైన చిత్రాలను చూడడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నేను, నా దేశం ఈ రెంటిలో నా దేశమే ముఖ్యమైనది. - డా॥ బి.ఆర్. అంబేడ్కర్



రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతోత్సవంలో అంబేద్కర్ జీవిత విశేషాలపై డిబిఆర్‌సి రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న **సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు మేరుగ నాగార్జున, మున్సిపల్ శాఖ మంత్రివర్యులు ఆదిమూలపు సురేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు** తదితరులు. అనంతరం సభలో మాట్లాడుతున్న డిబిఆర్‌సి రీజనల్ కోఆర్డినేటర్ జామి రమాదేవి

## ఏలూరులో..

డిబిఆర్‌సి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఏలూరు జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఏలూరు డిబిఆర్‌సి సభ్యులు యస్. జ్యోతి, ఝాన్సీ, సురేష్ ఆధ్వర్యంలో నగరం లోని వైఎస్సార్ కాలనీ ఓఎల్‌సీ సెంటర్‌లో విద్యార్థుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పిల్లలకు అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎల్‌సీలో చదువుతున్న పిల్లలకు అంబేద్కర్ జీవిత విశేషాల గురించి ప్రోత్సహించారు. ఓఎల్‌సీ టీచర్ యామిని అంబేద్కర్ గురించి తెలుసుకునేలా పిల్లలను ప్రోత్సహించారు. డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ ఝాన్సీ ఆధ్వర్యంలో పెదపాడు మండలం తాళ్ళగూడెం గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ సెక్రటరి, గ్రామ సంఘం అధ్యక్షులు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. డిబిఆర్‌సి జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్. జ్యోతి తో పాటు ఇతర సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

## ప్రకాశం జిల్లాలో..

ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను డిబిఆర్‌సి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంతో నిర్వహించిన జయంతి వేడుకల్లోనూ డిబిఆర్‌సి ప్రతినిధులు పాల్గొని సమాజానికి ఆయన అందించిన మార్గ నిర్దేశాన్ని వివరించారు. దర్శి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లోనూ డిబిఆర్‌సి సీపీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉల్లగల్లు, రాజగోపాల్‌రెడ్డి నగర్, ఈదర, భీమవరం, వేంపాడు గ్రామాల్లోనూ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. డిబిఆర్‌సి రీజనల్ కో-ఆర్డినటేర్ దార్ల కోటేశ్వరరావు, జి. వెంకట్రావు, జి. నాగమణి, జి. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను పల్నాడు జిల్లాలో డిబిఆర్‌సి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట లోని బేడ బుడగ జంగాల కాలనీ, బలిజేపల్లి గ్రామం, సత్తెనపల్లి తాలూకా సెంటర్ తదితర గ్రామాల్లో



అంబేద్కర్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్న బాలల విజ్ఞాన కేంద్రంలోని బాలలు, ఏలూరు

అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బలిజేపల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళలతోపాటు ర్యాలీ నిర్వహించారు. డిబిఆర్సి పల్నాడు జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, కో-ఆర్డినేటర్లు ఎం.వి.రమణ, కోటిరత్నం, అశోక్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది ఏఎన్ఎం నర్సులు, వాలంటీర్లు పాల్గొన్నారు. సత్తెనపల్లి లోని 16వ వార్డు చెంచు కాలనీలో ఓఎల్సీ సెంటర్లో చదువుతున్న పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. సచివాలయం ఎడ్యుకేషన్ సెక్రటరి హనుమంతరావు, ఆర్.పి. ఈశ్వరి, ట్యూషన్ టీచర్ దీవెన, పిల్లల తల్లిదండ్రులు పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. *



బాపట్ల జిల్లా, కొరిశపాడు మండలం, అంబేద్కర్ నగర్‌లో జనశిక్షణ సంస్థాన్ వారి సౌజన్యంతో డిబిఆర్సి ఆధ్వర్యంలో 40 మంది మహిళలు 2 నెలల డ్రెస్ మేకింగ్ శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న **కొరిశపాడు మండల అభివృద్ధి అధికారి డి. సురేష్, జనశిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ కె. శ్యాం సునీల్, కొరిశపాడు సిడిపికో కె. ఇందిర, డిబిఆర్సి రీజనల్ కోఆర్డినేటర్ డి. కోటేశ్వరరావు, డిబిఆర్సి రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ ఎం. హేమలత, ట్రైనింగ్ కోర్సు శిక్షకురాలు వై. జయంతి** తదితరులు.



ప్రసంగిస్తున్న కొరిశపాడు మండల అభివృద్ధి అధికారి డి. సురేష్



నీకోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు జనంకోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

విశాఖపట్నం



# వేస్ట్ పిక్కర్ల జీవితాల్లో కొత్త వెలుగులు

- గ్రేటర్ విశాఖలో ఫలిస్తున్న డిబిఆర్‌సి కృషి
- జీవన స్థితిగతుల మార్పునకు శ్రీకారం
- బడి బాట పడ్తున్న వేస్ట్ పిక్కర్ల పిల్లలు
- పూర్తి సహకారం అందిస్తామని గ్రేటర్ విశాఖ కమిషనర్ హామీ

**వేస్ట్ పిక్కర్లు.. జన జీవనాన్ని కమ్మేస్తున్న చెత్తా చెదారాల్ని ఎప్పటికప్పుడు ఏరివేస్తూ వాటిని అమ్మగా వచ్చిన అరకొర ఆదాయంతో జీవిస్తున్న అట్టడుగు శ్రేణి కార్మికులు..సమాజంలో గౌరవం, ఆర్థిక భద్రత లేని వారి జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరింపచేసేందుకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్‌సి) ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోంది.**

గడిచిన రెండు సంవత్సరాలుగా డిబిఆర్‌సి విశాఖపట్నంలోని పాత గాజువాక, వడ్లపూడి, నడుపూరు ఎస్టీ కాలనీ, గింజాం కాలనీ, బర్మా కాలనీ, కంచరపాలెం, తాడిచెట్లపాలెం, అల్లూరి సీతారామరాజు కాలనీ, ఏకలవ్య కాలనీ, చిన్న మూషినపాడు, ప్రియదర్శిని కాలనీ ప్రాంతాల్లో నివసిస్తున్న వేస్ట్ పిక్కర్ల సంక్షేమం కోసం పనిచేస్తోంది.

రోడ్లమీద చెత్తా చెదారాలను ఏరుకుని జీవించడం వేస్ట్ పిక్కర్ల ప్రధాన వృత్తి. ఏరుకున్న చెత్తను అమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదు. చెత్తను అమ్ముకోగా వచ్చిన అరకొర డబ్బులతో ఒక పూట తిండి కూడా గడవని స్థితి..వంటిమీద సైతం మురికి బట్టలే గతి..మురికి కాల్వల పక్కన ఎక్కడ జాగా దొరికితే అక్కడే వీరి ఆవాసం. రెక్కాడితే గానీ డొక్కాడని వేస్ట్ పిక్కర్ల కుటుంబాలపై ప్రభుత్వం అమలు చేస్తున్న ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమం తీవ్రమైన ప్రభావం చూపిస్తోంది. ప్లాస్టిక్ వాడకం తగ్గడం వల్ల వీరికి ప్రతి రోజూ సేకరించే సరుకు తగ్గిపోయి కుటుంబ పోషణ భారంగా మారింది. వీరు అమ్ముకోవడానికి పనికొచ్చే వ్యర్థాలు లభించక అసలే అరకొర ఆదాయమైతే అందులోనూ భారీ కోత పడింది. కొందరు వేస్ట్ పిక్కర్లు పందుల పెంపకం చేపట్టినా ఫలిత లేకుండా పోయింది. ప్రబలుతున్న వ్యాధుల వల్ల మున్సిపాలిటీల ఆధ్వర్యంలో పందులను నియంత్రించే పని చేపట్టడంతో ఆదాయం పూర్తిగా తగ్గిపోయి వేస్ట్ పిక్కర్లు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వేస్ట్ పిక్కర్ల జీవితాల్లో సమూల మార్పుల కోసం డిబిఆర్‌సి కృషి చేసింది. ◆

## సర్వే ద్వారా చేయూత..బడి బాట పట్టిన పిల్లలు

**వేస్ట్ పిక్కర్ల జీవన స్థితిగతులపై సమగ్ర సర్వే చేసిన డిబిఆర్‌సి, ప్రభుత్వ పథకాలను అందుకునేందుకు అర్హత ఉన్న వారిని గుర్తించింది. వారితో అర్హతల ఆధారంగా సంబంధిత పథకాలను అందుకునేందుకు దరఖాస్తు చేయించింది.** అధికారుల సహకారంతో వేస్ట్ పిక్కర్లకు గుర్తింపు కార్డులు వచ్చేలా డిబిఆర్‌సి కృషి చేసింది. అంతేకాదు.. వేస్ట్ పిక్కర్ల జీవితాల్లో మార్పులు రావాలంటే చదువుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించింది. వేస్ట్ పిక్కర్లను అనేకసార్లు సమావేశపర్చి పిల్లల చదువుకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను తెలియజెప్పింది. ఈ మేరకు డిబిఆర్‌సి అవుట్‌డోర్ లెర్నింగ్ సెంటర్లను (ఓఎల్‌సి) స్థాపించి వేస్ట్ పిక్కర్ల కుటుంబాల్లోని పిల్లలు బడులకు వెళ్ళేలా ప్రోత్సాహం అందించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అపరిశుభ్ర కార్మికుల పిల్లలకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం 100 మంది పిల్లలతో దరఖాస్తు చేయించి వారంతా స్కాలర్‌షిప్‌లు అందుకునేలా డిబిఆర్‌సి కృషి చేసింది. ఈ పరిస్థితుల దృష్ట్యా గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణా వ్యవస్థలోని ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే కార్యక్రమంలో వేస్ట్ పిక్కర్లకు ఉపాధి కల్పించవలసిందిగా ప్రోగ్రాం మేనేజర్ సి.హెచ్. శామ్యూల్ అనిల్‌కుమార్, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ నిఖిలతో కూడిన డిబిఆర్‌సి బృందం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కమిషనర్ (జివిఎమ్‌సి) సి.ఎమ్. సాయికాంత్ వర్మను కలిసి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన బ్రతుకులు బ్రతుకుతున్న వేస్ట్ పిక్కర్ల సంక్షేమం కోసం డిబిఆర్‌సి ఎంతో కృషి చేస్తుందని అభినందించారు. వేస్ట్ పిక్కర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని, వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, భవిష్యత్తులో గ్రేటర్ విశాఖ మున్సిపల్ పరిధిలో వీరికి ఉపాధి కల్పిస్తామని కమీషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఆర్‌సి కమ్యూనిటీ మొబిలైజర్ ధనలక్ష్మి, అజయ్, వేస్ట్ పిక్కర్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ✱




# ఎస్సీ రైతుల భూముల్లో భూసార పరీక్షలు

- **పంట నాణ్యత, అధిక దిగుబడులే లక్ష్యం**
- **భూసారంపై సమగ్ర అవగాహనతో సేద్యం**
- **వ్యవసాయాధికారులతో డీబీఆర్ సీ సమన్వయం**

**భూమి అంటే కేవలం పంట పండే ప్రకృతి వనరు మాత్రమే కాదు.. భూమి అంటే ఆర్థిక దన్ను..** భూమి అంటే ఆత్మగౌరవం. ఎస్సీలు కేవలం భూమిని కలిగి ఉండటమే కాదు.. భూమి సారాన్నీ, గుణాన్ని అర్థం చేసుకుని వ్యవసాయం చేయగలిగితే సత్ఫలితాలు వస్తాయి. ఎస్సీ రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో భూసార పరీక్షల నిర్వహణ కోసం దళిత బహుజన రీసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) చేసిన కృషి ఫలించింది. సంబంధిత శాఖ అధికారులతో డీబీఆర్సీ ప్రతినిధులు మాట్లాడి రాష్ట్ర వ్యాప్తంగా దళిత బహుజన రైతుల భూముల్లో భూసార పరీక్షలు చేయించారు.

దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఏరియా కో-ఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు అధ్యక్షతన ప్రకాశం జిల్లా వేంపాడు, నాయుడు పాలెం గ్రామాల్లో ముండ్లమూరు మండల వ్యవసాయాధికారి మేరమ్మతో పాటు వ్యవసాయాధికారులు పాల్గొని శాస్త్రీయ పద్ధతుల ద్వారా ఎస్సీ రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. భూమిలో ఖనిజ లవణాలు, పోషక లోపాలను అధిగమించేందుకు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని మట్టి లోని లోపాలను తెలుసుకోవాలని ఈ సందర్భంగా మేరమ్మ తెలిపారు. సాంకేతిక పద్ధతుల ద్వారా గుర్తించిన లోపాలను సరిదిద్దుకున్నప్పుడే అధిక పంట దిగుబడులు సాధించ వచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త ఆర్. కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ వాతావరణ స్థితిగతులను గుర్తించి అనుకూలంగా పంటలు సాగుచేసినపనుడు అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉంటుందన్నారు. భూసార పరీక్ష కేంద్ర నిపుణుడు జి. చిన్న నారాయణ మాట్లాడుతూ భూసార పరీక్షలు ద్వారా నేలలు వాటిలోని సహజ పోషక పదార్థాలతో పాటు సేంద్రీయ, రసాయనిక ఎరువుల్లోని పోషకాలను అదనంగా మొక్కలకు అందజేసినప్పుడు అధికోత్పత్తి సాధ్యమవుతుందన్నారు.

దళిత బహుజన రీసోర్స్ సెంటర్ రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ రైతులు తాము సాగుచేస్తున్న భూముల సమతుల్యం తెలుసుకునేందుకు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. దీని వల్ల సాగు చేస్తున్న భూముల్లో పోషక విలువలు, పోషక లవణాలు ఎంత శాతంలో ఉన్నాయో తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. పంటల పెరుగుదలకు అవసరమైన పోషకాల గురించి సమగ్రంగా తెలుసుకుని వాటిని అందించడం ద్వారా నాణ్యతతో కూడిన అధిక దిగుబడులను సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు, నాయుడుపాలెం గ్రామ వ్యవసాయ సహాయకులు టి. శోభారాణి, టి. వీరాంజమ్మ, వివిధ గ్రామాలలోని 20 మంది ఎస్సీ రైతుల పంట భూముల నుండి మట్టి నమూనాలు సేకరించి కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి భూసార పరీక్షల కేంద్రానికి పంపారు.

## సత్తెనపల్లిలో భూసార పరీక్షలు..

పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని తమ పొలాల్లో ఎక్కువ దిగుబడులు వచ్చే పంటలను వేసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన కల్పించారు. సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రామ సమావేశం నిర్వహించారు. చిన్నప్ప మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లిపెసర, జీలుగు, జనుము విత్తనాలను 50 శాతం సబ్సిడీ ద్వారా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇస్తున్నందున ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ రైతుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకుని భూమిలో ఉన్న సారాన్ని బట్టి పంటలను ఎంచుకుని సాగు చేయాలన్నారు. గ్రామాల్లో భూ యజమానులతో మాట్లాడి వారి ద్వారా అనుమతి పత్రంపై సంతకాలు చేయించుకుని క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డులు తీసుకోవాలి. కౌలు రైతులకు కూడా రూ 13,500 రైతు భరోసా తో పాటు ఇన్ పుట్ సబ్సిడీ, ఇతర రుణాలు అందుతాయి. ప్రతి ఎస్సీ రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలనీ, ఈ-క్రాప్ నమోదు ద్వారా పండించిన పంటలను మార్కెట్లో గిట్టుబాటు ధరలకు అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందని చిన్నప్ప తెలిపారు. *



ఎంత ఎక్కువ కాలం బతికామన్నది కాదు, ఎంత గొప్పగా జీవించామన్నదే ముఖ్యం. - డా॥ బి.ఆర్. అంబేద్కర్

# పెడసనగల్లు యానాదులు - సమస్యల పరిష్కారానికి సమాలోచనలు

**• కనీస వసతులు లేక నివాస ప్రాంతాలో దుర్భర జీవనం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు**

**కృష్ణా జిల్లా మొవ్వ మండలం పెడసనగల్లు గ్రామంలో** దశాబ్దాల తరబడి నివసిస్తున్న యానాదులు కనీస మౌలిక వసతులకు దూరమై దయనీయమైన దుర్భర జీవితాలను గడుపుతున్నారు. తాము కనీస ఆరోగ్యంతో జీవించేందుకు అవసరమైన వసతులను ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన ఐ.టి.డి.ఎ. మైదాన ప్రాంత అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి ఎం.రుక్మంగదయ్యను కలిసి తమ గోడు వెళ్ళబోసుకుని వినతిపత్రం సమర్పించారు. పెడసనగల్లు గ్రామ సర్పంచి కైతేపల్లి అన్నామణి యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలను తహశీల్దార్ సి. హెచ్.ఆంజనేయ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్ళారు.

ఈ సందర్భంగా యానాదులు మాట్లాడుతూ తాము ఏళ్ల తరబడి ఇక్కడే జీవిస్తున్నామనీ, చిన్నపాటి వర్షం పడినా ఇళ్ళలోకి నీరు చేరటంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని తెలిపారు.వర్షపు నీరు బయటకు పోయే కాల్వలు, డ్రైనేజీ వ్యవస్థ లేదు.. రోడ్లు లేవు..నివాస ప్రాంతాల ం పూర్తిగా లోతట్టుగా ఉండటంతో జీవితం నరకప్రాయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నివాసముంటున్న ప్రాంతాల్లోనే ఇళ్ళ పట్టాలు ఇవ్వటంతో పాటు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తో ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కుంభా రవిబాబు దృష్టికి కూడా తీసుకెళ్ళారు. ఆయన వెంటనే యానాదుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కృష్ణా జిల్లా కలెక్టర్‌కు లేఖ కూడా రాశారు. ఇక్కడే ఇళ్ల స్థలాలకు, పట్టాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ కూడా తాము నివసిస్తున్న ఇళ్లకు ఇక్కడే స్థలాల పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా యానాదులు తెలిపారు. ఈ విషయంపై ఐటీడీఏ ప్రాజక్టు అధికారి ఎం.రుక్మంగదయ్య మాట్లాడుతూ యానాదుల స్థలాలకు పట్టాలు లేక పూరి గుడిసెల్లో అవస్థలు పడుతున్నారనీ, రోడ్డు, డ్రైనేజి సమస్యలు తీవ్రంగా ఉన్నాయనీ, వర్షాకాలంలో ఇళ్ళ లోకి నీరు చేరే విషయాన్ని కూడా తాము గుర్తించావని తెలిపారు. దుర్భర స్థితిగతులను ఎదుర్కొంటున్న యానాదుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి వీలైనంత తొందరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మొవ్వ తహసిల్దార్ సి. హెచ్. ఆంజనేయప్రసాద్ మాట్లాడుతూ ఇక్కడి యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలు బాధాకరమైనవనీ, వాటి పరిష్కారానికి తాము పూర్తిగా సహకరిస్తామని అన్నారు. సర్పంచ్ కైతేపల్లి అన్నామణి మాట్లాడుతూ తమ గ్రామంలో గిరి పుత్రులు తనకు కన్నబిడ్డల్లాంటివారనీ, వారికి ఏ సమస్య వచ్చినా తాము ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల ఆదాం, నిర్మల, కుమారి, ఏకుల రవి, గుమ్మడి ప్రకాష్ రావు, కాలనీవాసులు పాల్గొన్నారు. *

---



# అగ్ని ప్రమాదం..ఇళ్ళు కోల్పోయిన చెంచులు

- అండగా నిలబడిన డీబీఆర్‌సీ
- తాత్కాలికంగా టార్పాలిన్‌ల పంపిణీ
- శాశ్వత గృహ నిర్మాణం కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు

**అగ్ని ప్రమాదం సంభవించి ఇళ్ళు దగ్ధమై** నిరాశ్రయులైన ప్రకాశం జిల్లా అర్ధవీడు మండల కేంద్రంలోని చెంచుగూడెంలోని చెంచులకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ టార్పాలిన్‌లు ఉచితంగా పంపిణీ చేసింది. ఇళ్ళు కోల్పోయిన చెంచులకు ప్రభుత్వం శాశ్వత గృహ నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తూనే అప్పటివరకు నిలువ నీడ లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న చెంచులకు డీబీఆర్‌సీ రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు (డ్యాని) ఆధ్వర్యంలో టార్పాలిన్ లను అందించారు. ప్రభుత్వ పథకాలు అందడంలో ఆలస్యం అవుతుందనే దృష్టితో టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేసినట్టు ఈ సందర్భంగా డ్యాని తెలిపారు. నిరాశ్రయులైన చెంచులకు భవిష్యత్ లోనూ డీబీఆర్‌సీ పూర్తిగా అండగా ఉంటుందనీ, కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మార్కాపురం, డివిజన్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆదిమూలపు అనిల్‌రాజ్‌లుక్, రోజ్ లిడియా, బూదాల గురవయ్య, చెంచు ప్రజలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం వెంటనే బాధితులకు అందేలా కృషి చేస్తున్నామనీ, అధికారుల దృష్టికి చెంచుల సమస్యలన్నిటినీ తీసుకువెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీడ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దున్న ఏబు, బహుజన పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు దాసరి యోబు, సొసైటి ఫర్ ఫాస్ట్ జస్టిస్ కార్యవర్గ సభ్యులు ఆదిమూలపు నగేష్, హబ్సిబా రాణి, డిబిఆర్‌సి సభ్యులు గోపనబోయిన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. *

## చదువే సంపద - చదువే సంస్కారం

# ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి చదువే ఆయుధం



### రాష్ట్ర వ్యాప్తంగా విద్యా చైతన్య ప్రచారోద్యమాలు నిర్వహించిన డీబీఆర్‌సీ

**వీధుల్లో చెత్త ఎత్తుకుని జీవిస్తూ** గ్రామాలు, పట్టణాలు, నగరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న వేస్ట్ పిక్కర్ల జీవితాలు మాత్రం మురికి కూపాలంగా ఉంటున్నాయి. ఆరోగ్యం లేదు..విద్య లేదు.. సొంత ఇల్లు లేదు.. పనిచేసుకుని బతుకుతున్నా సమాజంలో గౌరవం లేదు.. అలాంటి వేస్ట్ పిక్కర్ల జీవితాల్లో వెలుగులు ప్రసరింపచేసేందుకు దళిత బహుజన రీసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) తన వంతు కృషి చేస్తోంది. వేస్ట్ పిక్కర్స్ కుటుంబాలకు విద్య, వ్యక్తిగత గౌరవం, మంచి ఆరోగ్యం అందించటమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యా చైతన్య ప్రచారోద్యమం నిర్వహిస్తోంది. విశాఖపట్టం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని వేస్ట్ పిక్కర్లతో పాటు సంచార జాతుల కుటుంబాలకు చెందిన వారు దశాబ్దాల తరబడి కనీస వసతులకు దూరమై జీవిస్తున్నారు. వీరికి ప్రభుత్వం తో పాటు సమాజం నుంచి సహాయ సమకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జీవన భృతి కోసం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస వెళ్ళడం కారణంగా వారికి స్థిర నివాసం లేకుండా పోయింది. దీంతో వారు అన్ని అర్హతలున్నా హెల్త్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు కార్డులతో పాటు ఏ గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు. ముఖ్యంగా పిల్లలు బడులుకు పోకుండా పనులకు పోతున్నారు. చదువు యొక్క ప్రాముఖ్యత గురించి తెలియక తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యపై శ్రద్ధ చూపలేకపోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన డీబీఆర్‌సీ వేస్ట్ పిక్కర్లు పనిచేస్తున్న అన్ని ప్రాంతాల్లో విద్యా చైతన్య ప్రచారోద్యమం నిర్వహించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా వేస్ట్ పిక్కర్లు, డిఎన్‌టి కుటుంబాల ప్రజలకు విద్య ఆవశ్యకతను తెలియచెప్పి వారిలో చైతన్యం పెంచేందుకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.





**పల్నాడు జిల్లా:** సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంతో పాటు నరసరావుపేట పట్టణంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్, ఐసిడిఎస్, సేవే ప్రాణం-సేవే జీవితం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకూ, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన 5 సంవత్సరాలలోపు పిల్లలందరినీ ప్రీ ప్రైమరీ స్థాయి నుంచే అంగన్వాడీ సెంటర్లలో చేర్పించాలన్నారు. ఆ తరువాత ఐదు సంవత్సరాల పైబడిన వారిని ప్రాథమిక పాఠశాలల్లో, 6వ తరగతి నుంచి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి చదువు ఒక్కటే ఏకైక మార్గం..ప్రభుత్వం అందిస్తున్న విద్యా కానుక, అమ్మఒడి, వసతి దీవెన, విదేశీ విద్యను పొందాలంటే ప్రధానంగా పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నందిగామ సుశీల, సేవే ప్రాణం-సేవే జీవితం సర్వీస్ సొసైటీ అధ్యక్షులు నందిగామ నాగేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ ఎలమంద, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం ఎలమంద, నాగేశ్వరరావు, సుశీల గార్ల చేతులమీదుగా విద్యార్థిని విద్యార్థులకు తినుబండారాల పంపిణీ చేశారు.



జీవితంలో విలువలు నేర్పించేదే నిజమైన విద్య. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

**నరసరావుపేట:** జిల్లాలో డ్రాపౌట్ అయిన విద్యార్థులలో అధికశాతం యానాదుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉండడం అత్యంత బాధాకరమని, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నరసరావుపేట సిటీ కో–ఆర్డినేటర్ పాల వేణు అన్నారు. నరసరావుపేట పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవనోపాధిలో భాగంగా తల్లిదండ్రులు వలసలు వెళ్ళే క్రమంలో బిడ్డలను కూడా బడి మాన్పించి తీసుకుని వెళ్ళడం ద్వారా వారికి భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ బాధ్యతలు నిర్వహించే పెద్దల ఉపాధికీ, పిల్లల చదువుకు ఆటంకం ఏర్పడకుండా ప్రత్యామ్నాయ విధానాలు అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుపుతున్న సంక్షేమ హాస్టళ్ళు, గురుకుల పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి కనబర్చాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు సిద్ధం చేసిందనీ, అమ్మఒడి ద్వారా తల్లుల అకౌంట్లో రూ. 15 వేలు జమచేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తుంది..తమ బిడ్డలను బడిలో చేర్పించి ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ కవిత మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపడానికి జీవితాంతం కృషి చేశారనీ, వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని మన బిడ్డలను చదివించుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు పలక, బలపాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు శ్రీను, అంగన్‌వాడీ టీచర్ వాలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

**బాపట్లజిల్లా:** విద్యను పరమావధిగా భావించి తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండేలా ఎస్సీ, ఎస్టీల కుటుంబాల్లోని తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజారాం తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని వేస్ట్ పిక్కర్స్ కుటుంబాల బాల, బాలికల విద్యాభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు ఆట వస్తువులు, బ్లాక్ బోర్డులు, పలకలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలలోని పిల్లలు విద్యాపరంగా ఎదగాలన్నారు. డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించి, వారు విద్యకు దూరం కాకుండా ప్రత్యేకంగా ఓఎల్‌సీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్ కుటుంబాల బాల, బాలికల విద్య కోసం విద్యా చైతన్య ప్రచార ఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహించి అందులో భాగంగా విద్యార్థులకు అవుట్‌డోర్ లెర్నింగ్ సెంటర్లను ప్రారంభించామన్నారు. దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ ఛైర్మన్





దేవరపల్లి డేవిడ్‌రాజు మాట్లాడుతూ డీబీఆర్‌సీ అణగారిన పిల్లల విద్యాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతోందన్నారు. డీబీఆర్‌సీ సిటీ కోఆర్డినేటర్ సరోజిని మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అద్దంకి ఏరియా డీబీఆర్‌సీ కోఆర్డినేటర్ పి.వీరయ్య మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులు, స్వచ్ఛంధ సేవా సంస్థలు కలిసి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆట వస్తువులు, పలకలు, బ్లాక్‌బోర్డు పంపిణీ చేశారు.

**ప్రకాశం జిల్లా:** దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో దర్శి మండలం సాయినగర్ కాలనీలో నివసిస్తున్న కాటికాపరులకూ, ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న వేస్ట్ పిక్కర్లకు విద్యా చైతన్య ప్రచారోద్యమలో భాగంగా దర్శి కో–ఆర్డినేటర్ గుంటూరు






నాగమణి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం ఉచిత విద్య, స్కూల్ యూనిఫాం, అమ్మఒడి, మధ్యాహ్న భోజన పథకం వంటి పథకాలు అమలు చేయటంతో పాటు పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షించి భారత రాజ్యాంగంలో విద్యాహక్కు చట్టాన్ని పొందుపరచారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు పాఠశాలల్లో 75 శాతం హాజరు ఉన్నట్లయితే అమ్మఒడి వస్తుందన్నారు. క్రమం తప్పకుండా బడికి పంపిస్తే మంచిగా చదువు వస్తుందన్నారు. డ్రాపౌట్స్ పిల్లలను కూడా గుర్తించి వారి వయస్సుకు తగ్గట్లుగా ఆయా తరగతుల్లో చేర్పించనున్నట్లు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సాయినగర్ అంగన్‌వాడీ టీచర్, వాలంటీర్ అంజనేయులు, స్కూల్ ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

**గుంటూరు పరిధిలోని వెనిగండ్ల, సుద్దపల్లిడొంక, కెవిపి కాలనీ, సీతమ్మ కాలనీ, తెనాలి, వడ్డేశ్వరం, ఏలూరు టౌన్, దెందులూరు, ఒంగోలు టౌన్ మరియు విజయవాడలలోని వేస్ట్ పిక్కర్లు తో పాటు డిఎన్‌టిలు నివసిస్తున్న ప్రాంతాలలో డీబీఆర్‌సీ విద్యా చైతన్య కార్యక్రమాలను నిర్వహించి తల్లి దండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది.** *


దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి. - డా॥ బి. ఆర్. అంబేద్కర్







# వేస్ట్ పికర్ల సామాజిక, ఆర్థికాభివృద్ధికై కృషి

– సి.హెచ్. అనిల్‌కుమార్, ప్రోగ్రాం మేనేజర్, డిబిఆర్‌సి

**సమాజంలో అత్యంత దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న వేస్ట్ పిక్కర్లు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా కృషి చేయడమే వేస్ట్ పిక్కర్ల సహకార సంఘం యొక్క లక్ష్యమని ప్రోగ్రాం మేనేజర్ చుక్కా శామ్యూల్ అనిల్‌కుమార్ అన్నారు. వేస్ట్ పిక్కర్లు గౌరవప్రదంగా జీవించానికి మనమందరం కృషి చేయాల్సిన అవసరం ఉందని వేస్ట్ పిక్కర్ల సహకార సంఘ సమావేశంలో చుక్కా శామ్యూల్ అనిల్‌కుమార్ అన్నారు.**

జూన్ 26, 28 తేదీలలో ఎన్టీఆర్ కృష్ణా, గుంటూరు జిల్లాలలో వేస్ట్ పిక్కర్ల సహకార సంఘ సర్వసభ్య సమావేశములు నిర్వహించారు. ఈ సమావేశాలలో ముఖ్య అతిథిగా అనిల్‌కుమార్ పాల్గొని, డిబిఆర్‌సి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా వేస్ట్ పిక్కర్ల కోసం సహకార సంఘాన్ని స్థాపించామని, వేస్ట్ పిక్కర్లు తమ ఆదాయంలో కొంతమొత్తాన్ని సొసైటీలో పొదుపు చేసుకోవడం ద్వారా తమకు అవసరమైనప్పుడు ఆ మొత్తాన్ని వాడుకోవచ్చని వివరించారు. వేస్ట్ పిక్కర్లందరూ సహకార సంఘ సభ్యులుగా చేరాలని కోరారు. సంఘం ఏర్పాటు చేసిన తర్వాత వేస్ట్ పిక్కర్ల జీవితాల్లో మార్పు రావడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. గుంటూరులో వేస్ట్ పిక్కర్స్ సహకార సంఘం ఆధ్వర్యంలో స్క్రాప్ షాప్‌ను ఏర్పాటు చేశామని, తద్వారా వేస్ట్ పిక్కర్లు శ్రమ దోపిడీ నుండి, ఆర్థిక దోపిడీ నుండి ఉపశమనం పొందేలా ఇది ఉపయోగ పడుతుందన్నారు. ఎంతో దూరం ప్రయాణం చేసి కష్టపడి సేకరించిన చెత్తను అధిక రేటుకు అమ్మినప్పుడే ఆ కుటుంబాలకు ఉపయోగపడుతుందన్నారు. వేస్ట్‌పిక్కర్లు తెచ్చే వ్యర్థాల్ని బయటి స్క్రాప్ షాప్‌లతో పోల్చితే కొంత ఎక్కువ ధరకు వారి దగ్గరనుండి కొనడం (సేకరించడం) జరుగుతోందన్నారు.

**కోఆపరేటివ్ సొసైటి ప్రెసిడెంట్ పాలపర్తి అక్కమ్మ మాట్లాడుతూ** సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం వల్ల సొసైటి పనితీరు గురించి, వేస్ట్ పిక్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆరోగ్యం, పొదుపు యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కలిగిందని, తద్వారా ఎక్కువమందిని చైతన్యవంతులను చేయగలుగుతున్నామని అన్నారు. భవిష్యత్తులో సొసైటి మరింతగా అభివృద్ధి చెందడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

**కోఆపరేటివ్ సూపర్‌వైజర్ బందెల రమేష్ మాట్లాడుతూ** సహకార సంఘంలో సభ్యులుగా చేరిన వేస్ట్ పిక్కర్లందరూ చక్కగా పొదుపు చేసుకుంటూ, తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తుంటే 3 సం॥ల తరువాత ప్రభుత్వం నుండి లేదా ఇతర సంస్థల నుండి రుణాలు పొందే అవకాశం ఉందని వివరించారు. సంఘం లోని సభ్యులు స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పడి జీవనోపాధుల మెరుగుదలకై సబ్సిడీ లోన్లు పొందవచ్చని అన్నారు.

**వేస్ట్‌పిక్కర్ల కోఆపరేటివ్ సొసైటి సర్వసభ్య సమావేశంలో సూపర్‌వైజర్లు, సిటీ కోర్డినేటర్లు, సొసైటి ప్రెసిడెంట్లు, సభ్యులు పాల్గొన్నారు.** *



Image: pexels

# పంట సాగుదారుల చట్టం 2019 పై
# రాష్ట్రవ్యాప్త ప్రచారోద్యమం



**కౌలు రైతులకు సిసిఆర్సీ కార్డులపై అవగాహన కల్పించి వారికి ప్రభుత్వం అందించే సహాయ సహకారాల గురించి తెలియజేసి ఎస్సీ, ఎస్టీ రైతులను చైతన్యపరచాలనే ఉద్దేశ్యంతో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్రవ్యాప్త ప్రచారోద్యమం జూన్ నెలలో 10 రోజులపాటు నిర్వహించింది. ఈ ప్రచారోద్యమ ప్రధానోద్దేశం రైతులకు మరియు కౌలు రైతులకు పంట సాగుదారు చట్టంపై అవగాహన పెంపొందించడం.**

**ఈ ప్రచారోద్యమం ప్రధాన ఉద్దేశ్యం:**

- భూ యజమానులందరికి తమ కౌలుదారులకు తగు సహాయ సహకారాలు అందజేసేవిధంగా తగిన అవగాహన కల్పించడం.
- పంటసాగుదారు కార్డుదారులందరికి ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో క్రాప్‌లోన్లు మంజూరుకు సహకరించడం.
- పంట సాగుదార్లు అందరికి కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయడంపై అవగాహన కల్పించడం.
- వివిధ రుణ సంస్థల నుండి తీసుకున్న రుణాన్ని ఇంతవరకు చెల్లించని రైతులకు తిరిగి రుణం చెల్లించేటట్లు అవగాహన కల్పించడం.

**బాపట్ల జిల్లా లో** ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాల జారీ సభలు కాలనీల్లో నిర్వహించి సాగుదారుల కార్డులు ఇవ్వాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నేతలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అనేక వేల మంది భూ యజమానుల వద్ద, దేవాదాయ భూములు ఉన్నాయని, సాగుచేస్తున్న కౌలు రైతులకు చాలా ప్రాంతాలలో ఆ భూములను సాగుచేస్తున్నప్పటికీ నేటికీ పంట సాగు ధ్రువీకరణ పత్రం (సీసీఆర్సీ) పొందలేకపోతున్నారని అన్నారు. దళిత వాడల్లో కౌలు రైతుల కోసం గ్రామసభలు నిర్వహించాలని కోరుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో ఇప్పటివరకు ఎస్సీ ఎస్టీ కౌలు రైతులు వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించడం కష్టమైన ఈ కాలంలో కౌలు రైతు పరిస్థితి దయనీయంగా ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీలు బ్యాంకు నుండి పంట రుణాలు, పంట భీమా, వివిధ సబ్సిడీ పథకాలు పొందలేకపోతున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు గుడే రాజారావు మాట్లాడుతూ జిల్లాలో దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు గ్రామ సభలలో అవకాశం కల్పించి ఆ భూములు పొందిన రైతులకు ఒకేసారి కౌలు చెల్లించకుండా కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సు ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీలకు 3 విడతలుగా చెల్లింపు విధానాన్ని



అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మండలాల్లో రైతు భరోసా కేంద్రాల వారీగా కౌలు రైతుల గుర్తింపు కోసం గ్రామ సభలు మొదలు పెడుతున్నామని అన్నారు. తదుపరి కలెక్టర్‌తో పంట సాగుదారుల చట్టం ప్రచారోద్యమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ ఛైర్మన్ దేవరపల్లి డేవిడ్‌రాజు, అద్దంకి నియోజకవర్గ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో–ఆర్డినేటర్ పులిపాటి వీరయ్య, బాపట్ల సిటి కో–ఆర్డినేటర్ కె. సరోజిని, దళిత మహాసభ అధ్యక్షుడు ఇ. సింగయ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

**పల్నాడు జిల్లా, నరసరావుపేట లో** దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచార కార్యక్రమం యల్లమంద, గురవాయపాలెం, ఇక్కుర్తి గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల ద్వారా పొందే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా ఆర్థిక స్థితిగతులు కొంత మెరుగుపడతాయన్నారు. కౌలు రైతులు సాగుచేస్తున్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం దళిత వాడల్లో మైకు ద్వారా ప్రచారం, బ్యానర్లు, కరపత్రాలు పంపిణీ చేసి సీసీఆర్సీ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిబిఆర్‌సి సిటీ కో–ఆర్డినేటర్ వేణు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సాయినాథ్, షహీద్ తదితరులు పాల్గొన్నారు.

**ముప్పాళ్ళ మండలంలో** దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచార ఉద్యమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లారెడ్డి మరియు అగ్రికల్చర్ అధికారి ఏ.వో. అరుణ, ఏ.పీ.వో. రామారావు, డీడీ ప్రసాద్, ఏవో అరుణ పాల్గొన్నారు. ఎంపిడివో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు సిసిఆర్సీ కార్డులు పొందడం ద్వారా రైతు భరోసా కేంద్రం నుంచి ఇన్పుట్ సబ్సిడీ విత్తనాలు, ఎరువులు మరియు బ్యాంకు ద్వారా రుణాలు కూడా పొందడానికి అవకాశం ఉంటుందని తెలియజేస్తూ కౌలు రైతులు వారు వేసిన పంటలను కూడా పొందడానికి




అవకాశం ఉంటుందని అన్నారు మరియు ఎస్సీ, ఎస్టీ రైతులు వేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. డిబిఆర్‌సి ఏరియా కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఉన్న కౌలు రైతులు సీసీఆర్సీ కార్డుల గురించి అవగాహన పొందేందుకు వారి వాడలో ప్రచార సాధనం, కరపత్రాలు మరియు గ్రామ సమావేశాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు హరిప్రసాద్, సంజీవరావు, మస్తాన్, మాబోలి మరియు అగ్రికల్చర్ అసిస్టెంట్ శైలజ, డిబిఆర్‌సి ప్రతినిధులు మన్నం కోటేశ్వరరావు, నరేంద్ర మరియు రైతులు పాల్గొన్నారు.

**ఇరుకుపాలెం (ముప్పాళ్ళ):** కౌలు కార్డుతో కౌలు రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి కౌలు రైతు సీసీఆర్సీ పొందుటకు అర్హులేనని తహసీల్దార్ ఎమ్. భవానిశంకర్ చెప్పారు. మండలం లోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో రెవెన్యూ శాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటసాగు హక్కు పత్రంపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న తహశీల్దార్ సీసీఆర్‌సి కౌలు రైతుకు ఇవ్వడం వల్ల భూ యజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఇది భూ యజమానికి, సాగుదారునికీ మధ్య 11 నెలలు మాత్రమే ఉండే ఒప్పందం అని చెప్పారు. ఈ కార్డు వల్ల పంట రుణాలు, పంటల భీమా, సున్నా వడ్డీ లాంటి పథకాలు వర్తిస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకు సీసిఆర్‌సీ వల్ల





రైతు భరోసా వర్తిస్తోందన్నారు. పంటలకు మార్కెట్‌లో ధర లేనప్పుడు ఆర్బీకేలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకోవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి ఎమ్. అరుణ, ఆర్ కపిల్‌దేవ్, ఉపసర్పంచ్ సైదా, వీఆర్వో హరిప్రసాద్, వీహెచ్‌వి నరేష్ పాల్గొన్నారు.

**రాజుపాలెం మండలంలో** డిబిఆర్‌సి ఆధ్వర్యంలో సిసిఆర్‌సి కార్డుల గురించి మండలంలోని నెమలిపురి గ్రామంలో రైతులకు మరియు కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న విఆర్‌ఓ బికారిసాహెబ్ మాట్లాడుతూ కౌలు కార్డు పొందేందుకు కౌలు రైతులు భూ యజమాని యొక్క పట్టాదారు పాసు పుస్తకం, 1బి, ఆధార్ కార్డు, నకలు తీసుకొని కౌలుదారుని ఆధార్ కార్డు, మూడు ఫోటోలు అందజేయాలని సూచించారు. తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలని భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలియజేశారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ గడిపర్తి కోటిరత్నం, పలువులు రైతులు పాల్గొన్నారు.



గణపవరం, బలిజేపల్లి గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ కాలనీలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బడ్జెట్‌వాచ్ కో-ఆర్డినేటర్ డా॥ బి. రమణమూర్తి పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు భూమిని లీజుకు తీసుకుని సాగు చేస్తున్నారన్నారు. కౌలు రైతులకు భూ యజమానులు సహకరించి సిసిఆర్‌సి కార్డులు వచ్చేలా సహకరించాలని కోరారు. స్థానిక సచివాల యంలో విఆర్‌ఓను కలిసి పంట రుణ అర్హత కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ రుణ అర్హత కార్డుల వలన భూ యజమానులు ప్రభుత్వం నుండి పొందే ప్రతి పథకాలు కౌలు రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఏరియా కో-ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎస్సీ ఎస్టీ కౌలు రైతులు అందుకుని అభివృద్ధి చెందాలని రైతులకు తెలియజేశారు. గ్రామంలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నందున సీసీఆర్సీ కార్డులను దరఖాస్తు చేసుకోవాలన్నారు. గణపవరం వీఆర్వో హుస్సేన్ మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డులు అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్, వాలంటీర్లు, స్థానిక సర్పంచ్ బుల్లిబాబు, రైతులు పాల్గొన్నారు.




**ప్రకాశం జిల్లా, దర్శి మండలంలో** పంట సాగుదారుల చట్టంపై ప్రచార ఉద్యమ కార్యక్రమం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ గుంటూరు నాగమణి అధ్యక్షతన కురిచేడు మండల తహశీల్దార్ జోల నరసింహారావు మరియు వ్యవసాయ శాఖాధికారి పి. మధుబాబుల చేతుల మీదుగా కౌలు రైతుల ప్రచారోద్యమ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఎన్ఎస్పి అగ్రహారం, అలవలపాడు, భోజనంపాడు గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ రైతులకు, భూ యజమానులకు కౌలు రైతుల కార్డులపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో బోదనంపాడు అగ్రికల్చర్ అసిస్టెంట్ అనూరాధ, అలవలపాడు విఆర్‌ఓ అనూష పాల్గొని భూ యజమానులకు అవగాన


దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

కల్పించారు. ప్రతి కౌలు రైతు పాల్గొని గుర్తింపు కార్డులు పొందాలని, మండలాల్లో ఉన్న మహిళా రైతులకు, కౌలు రైతులకు, భూ యజమానులకు, ఎస్సీ, ఎస్టీ రైతులకు సిసిఆర్‌సి కార్డుల ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.




**ఏలూరు జిల్లా లో** ప్రతీ రైతుకు సాగుదారు కార్డు జారీచేసి పంట రుణాలు, సంక్షేమ పథకాలు అందుకోవాలనే ఉద్దేశ్యంతో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచారోద్యమం పెదపాడు మరియు లింగపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ గోశాల ఝాన్సీరాణి మాట్లాడుతూ, కౌలుదారులకు సహకరించే విధంగా భూ యజమానులకు అవగాహన కల్పించడం, పంట సాగుదారులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయడం రైతుభరోసా సబ్సిడీ, విత్తనాలు, వివిధ రకాల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం కొరకు ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కౌలు రైతులంతా చైతన్యం పొందాలని, పంట రుణాలు, రైతు భరోసా పొందాలన్నారు. గ్రామ వాలంటీరు, విఆర్‌ఓలను సంప్రదించి సాగుదారు కార్డును పొందాలని, తద్వారా పంట రుణాలు పొందే అర్హత కలుగుతుంది అన్నారు. భూ యజమానులు కౌలు రైతులకు సహకరించాలని కోరారు. పంటసాగుదారులు ఖరీఫ్‌లో రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. సబ్సిడీ విత్తనాలు, సబ్సిడీ యంత్ర పరికరాలు కోసం కూడా దరఖాస్తులు చేసుకోవాల న్నారు. పెదపాడు, కొత్తూరు గ్రామాలలో రైతులు, కౌలు రైతులు, భూ యజమానులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్. ఏసురత్నం, ఎన్. కొండలరావు, కె. లూర్ధమ్మ, ఎలిషారావు, మాగుంట నాగరాజు, ధనలక్ష్మి, కె. నవీన్, ఎస్. తిరుమలరావు, అభిషేకరీ తదితరులు పాల్గొన్నారు. *




గుంటూరు కృషి విజ్ఞాన కేంద్రం లో నిర్వహించిన వ్యవసాయాభివృద్ధి మరియు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు అనంతరం చిన్న సన్నకారు రైతులకు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందజేస్తున్న **కె.వి.కె. డైరక్టర్ డా॥ కె.వి. సుబ్రహ్మణ్యం, డా॥ శ్రీమతి గంగాభవాని** తదితరులు




ఏలూరు

# సంక్షేమ పథకాలు పొంది వేస్ట్ పిక్కర్లు అభివృద్ధి చెందాలి

- హేమలత, ట్రైనింగ్ కో-ఆర్డినేటర్, డిబిఆర్‌సి

**ముఖాముఖి సమావేశములు**

- వేస్ట్ పిక్కర్లు, డిఎన్‌టి లను ప్రభుత్వం ఆదుకోవాలి
- అందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలి
- పిల్లలను బడుల్లో చేర్పించాలి
- నిరంతరం వేస్ట్ పిక్కర్ల సంక్షేమం కొరకు పనిచేస్తున్న డిబిఆర్‌సి

**బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు పొంది ఎస్సీ, ఎస్టీలు, వెనుకబడిన తరగతులవారు అభివృద్ధి చెందాలని డిబిఆర్‌సి రాష్ట్ర ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ హేమలత అన్నారు. వేస్ట్ పిక్కర్ల సంక్షేమం కొరకు డిబిఆర్‌సి జిల్లాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటుచేసింది.**

**ఏలూరు:**

స్థానిక ఏలూరు ఎన్.ఆర్ పేట, సీఐటీయూ భవన్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో వేస్ట్ పిక్కర్స్‌కు మరియు ప్రభుత్వ అధికారులకు ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ చెత్త కాగితాలు ఏరుకొని జీవిస్తున్నవారు ఇంకా గుర్తింపు కార్డులు కూడా లేకుండా ఉన్నారని, వారికి ప్రభుత్వం అందించే పథకాలు పొందడానికి అవకాశం లేనందున వారికి అవసరమైన గుర్తింపు కార్డులు, తద్వారా ప్రభుత్వ పథకాలు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో మెప్మా సంస్థ టెక్నికల్ ఆఫీసర్ మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్, మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి పొదుపులు చేసుకుని తద్వారా అభివృద్ధి, గౌరవం పొందాలని అన్నారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఐ.టి.డి.ఎ. ట్రైబల్ వెల్ఫేర్ ఎ.పి.ఒ. నాయుడు మాట్లాడుతూ పిల్లలను చదివించడం ద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందని, ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో స్థిరపడినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పిల్లలకు ఆధార్ కార్డులు, స్కూల్ ఎన్రోల్‌మెంట్, హాస్టల్ సదుపాయాలు ఉచితంగా కల్పిస్తామన్నారు.

ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి ఎ. వరప్రసాద్ మాట్లాడుతూ యానాదుల కుటుంబంలో చేపలు పట్టుకుంటున్న వారికి లైసెన్సుల ం, ఇన్స్యూరెన్సు ఉచితంగా చేయించుకోవాలని చెప్పారు. తద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాలు పొంది ఆర్థికంగా స్థిరపడవచ్చు అన్నారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి రీజనల్ కోఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్ అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని చెప్పారు. చదువు అంటే ఏమిటో కూడా తెలియని కుటుంబాలు ఇంకా చాలా ఉన్నాయని, వారిని చైతన్యవంతం చేసి సమాజంలో భాగం చేయవలసిన అవసరం ప్రభుత్వం పైన ఉందని, స్వచ్ఛంద సంస్థగా తమ వంతుగా తాము పనిచేస్తున్నామని తెలిపారు.



జీవించేందుకే మనిషి తినాలి. సమాజ సంక్షేమానికై జీవించాలి. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

విద్యుత్ డిపార్ట్‌మెంట్ ఎఇ పి. శ్రీనివాస్ గారు మాట్లాడుతూ 200 యూనిట్ల కంటే తక్కువ ఖర్చు పెట్టేవారు ఫ్రీ కరెంట్‌కు అప్లై చేసుకోవచ్చని దానికి కావలసిన డాక్యుమెంట్లు గురించి సవివరంగా వివరించారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి సిబ్బంది జి. ఝాన్సీ పాల్గొనగా సిటీ కో-ఆర్డినేటర్ బలే సురేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

**గుంటూరు:**




గుంటూరులో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు మరియు డిబిఆర్‌సి ప్రతినిధులు పాల్గొన్నారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిత్తు కాగితాలు ఏరుకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి పిల్లలకు విద్యను అందిస్తామని ప్రతి ఒక్క విద్యార్థినీ పాఠశాలల్లో చేర్పిస్తామని అందుకు ప్రతి పనిని తమ బృందం పరిశీలిస్తుందని తెలిపారు.

సోషల్ వెల్ఫేర్ విభాగం ప్రతినిధి చెంచులక్ష్మి మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలుగా ఉన్న వేస్ట్ పిక్కర్లను గుర్తించి వారి సంక్షేమ కోసం పనిచేస్తున్న డిబిఆర్‌సి బృందానికి అభినందనలు తెలుపుతూ, ప్రతి ఒక్క పేదవాడూ ప్రభుత్వం అందించే పథకాలను పొంది సమాజంలో గుర్తింపు పొందాలని తెలిపారు.

డిబిఆర్‌సి ప్రోగ్రామ్ మేనేజర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్ల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ, సమాజంలో భాగం కాకుండా పేదరికంలో ఉన్న వేస్ట్ పిక్కర్లు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొంది అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కో-ఆర్డినేటర్ చిన్నప్ప, కమ్యూనిటీ మొబలైజర్ రాజశేఖర్, రవితేజ వివిధ ప్రాంతాల నుండి వేస్ట్ పిక్కర్లు పాల్గొన్నారు.




**విజయవాడ:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులంతా వినియోగించుకోవాలని గిరిజన సంక్షేమ అధికారి డి.టి. రుక్మంగదయ్య అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ఇంకా ఆధార్ కార్డులు లేని యానాదులు చాలామంది ఉన్నారని, వారందరికి త్వరలోనే అందజేస్తామని చెప్పారు. చెత్త ఏరుకునే వారికి చేతి వృత్తులు నేర్పించి, సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. డిబిఆర్‌సి కో-ఆర్డినేటర్ జామి రమాదేవి మాట్లాడుతూ చెత్త ఏరుకునే వారికి ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవంతో పథకాలు అందడం లేదని చెప్పారు. వైఎస్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న వాగ్రీవులు 20 ఏళ్లు విజయవాడ రైల్వేస్టేషన్ ముందు పాత వస్త్రాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారని, వారందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ, ఏ ఆధారం లేని సమూహాలు ఎవరిని సహాయం అడగాలో తెలియక సతమతమవుతున్న వారికి డిబిఆర్‌సి అధికారులకు, ప్రజలకు సత్సంబంధాలు ఏర్పాటు కోసం ఇలాంటి ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి ఆ సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వేస్ట్ పిక్కర్లు, డిఎన్‌టిలు పాల్గొన్నారు. *

విశాఖపట్నం జిల్లా




# విద్యా చైతన్య యాత్ర

- విద్య అందరి హక్కు
- విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు
- వేస్ట్ పిక్కర్ల పిల్లలు పనిలో కాదు - బడిలో ఉండాలి

**విశాఖపట్నం జిల్లాలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వివిధ అపరిశుభ్ర ప్రాంతాల్లో జీవిస్తున్న వేస్ట్ పిక్కర్స్‌ను గుర్తించి వాళ్ళ జీవన విధానాన్ని, వాళ్లు పడుతున్న కష్టాలను, ఆరోగ్య సమస్యలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తుంది.**

వేస్ట్ పిక్కర్ల ప్రధాన ఆదాయం చెత్త సేకరించడం, వాటిని దళారుల దగ్గర అమ్ముకోవడం. వేస్ట్ పిక్కకర్లు పిల్లల్ని వాళ్లతోపాటు చెత ఏరడానికి తీసుకువెళ్తున్నారు. అందువల్ల రూ. 300/- అదనంగా వస్తుంది, దాంతో పిల్లల్ని ఎవరూ కూడా స్కూల్‌కి పంపించకుండా చెత్త ఏరడానికి తీసుకెళ్తున్నారు. డిబిఆర్‌సి గత 2 సంవత్సరాలుగా వాళ్లతో అనుబంధాలు పెంచుకుని వాళ్ల స్థితిగతులను తెలుసుకుని పిల్లలతోనూ, పెద్దలతోను మాట్లాడి జరిగింది. పిల్లలకు చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించి వేస్ట్ పిక్కర్స్ ఉన్న అన్ని ప్రాంతాలలో అవుట్‌డోర్ లెర్నింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఓఎల్‌సీ లలో టీచర్లను వారి ప్రాంతాలలో ఉన్న వాళ్లనే టీచర్లుగా నియమించడం, వాళ్ళకి చదువన్నా, టీచర్లన్నా ఉన్న భయంపోయి చదువుపై ఆసక్తి కలుగుతుందనే నమ్మకంతో వీటిని ప్రారంభించారు. మొదట్లో ఓఎల్సీ సెంటర్లలో 20 మంది పిల్లలు చదువుకునేవారు, ప్రస్తుతం పిల్లల సంఖ్య 30 వరకు పెరిగింది. ఓఎల్‌సీలు ప్రారంభించకముందు స్కూల్స్‌కు వెళ్ళే పిల్లలు సాయంత్రం వచ్చి హోమ్‌వర్క్ లు చేయకపోవడం, పాఠాలు అర్థం కాకపోవడం, చదవకపోవడం, పిల్లలు క్రమం తప్పకుండా స్కూల్‌కు వెళ్లకపోవడం జరిగేది. ఓఎల్‌సీలు ప్రారంభించాక వాళ్ళకు హోంవర్కు చేసుకునే సౌకర్యం కలిగింది. అదేవిధంగా పిల్లలకు పాఠాలు అర్థం కాకపోయినా, సందేహాలు ఉన్నా ఓఎల్‌సీ టీచర్లను అడిగి తెలుసుకోవడం, ట్యూషన్‌లో మాట్లాడటం, ఆటలాడడం అల వాటు చేసుకున్నారు. కొంతమంది పిల్లలు ట్యూషన్‌కొచ్చేవారు కానీ, స్కూల్‌కి వెళ్లేవారు కాదు. ఈ విషయాన్ని గుర్తించిన డిబిఆర్‌సి బృందం వాళ్ళలో చైతన్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో వేస్ట్ పిక్కర్లు నివసిస్తున్న ప్రాంతాలైన గిరిజా కాలనీ, ఎస్టీ కాలనీ, వడ్లపూడి తదితర ప్రాంతాలలో పిల్లలకు, పెద్దలకు "నేటి బాలలే - రేపటి పౌరులు" అనే నినాదంతో "విద్యా చైతన్య యాత్ర" కార్యక్రమాన్ని మే, జూన్ నెలల్లో ఏర్పాటు చేసి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎపిపిఐ సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. అందరూ "పిల్లలను స్కూల్‌కు పంపించాలి", "పిల్లల్ని చెత్త ఏరడానికి పంపించవద్దు" అని ప్లకార్డులతో ర్యాలీలు నిర్వహించారు. స్కూల్‌కి వెళ్లని 25 మంది పిల్లలను డిబిఆర్‌సి బృందం స్కూల్లో జాయిన్ చేయించారు. ఈ కార్యక్రమంలో అన్ని ఏరియాలలోని పెద్దలు, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కమ్యూనిటీ పిల్లలు పాల్గొన్నారు. ✱



భవనాన్ని గట్టి పునాది నిలబెట్టినట్లే విద్యార్థులు సత్‌ప్రవర్తనతో దేశాన్ని నిలబెట్టుకోవాలి. - డా॥ బి.ఆర్. అంబేద్కర్

విశాఖపట్నం జిల్లా




# ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

**విశాఖపట్నం జిల్లాలో నివసిస్తున్న వేస్ట్ పిక్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడానికి డిబిఆర్‌సి సిబ్బంది ప్రాజక్టు కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ నిఖిలి, కమ్యూనిటీ మొబిలైజర్లు ధనలక్ష్మి, అజయ్‌కుమార్ వేస్ట్ పిక్కర్లు నివసిస్తున్న ఏరియాలు ఏఎస్ఆర్ కాలనీ, ఎస్టీ కాలనీ, గిరిజ కాలనీ, వడ్లపూడి, కంచరపాలెం, గాంధీనగర్‌లలో ఈ కార్యక్రమం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో, ఎపిపిఐ సహకారంతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.**

ఈ ఏరియాలో నివసిస్తున్న వేస్ట్ పిక్కర్లు చాలామందికి వివిధ రకాలైన ప్రభుత్వ పథకాలపై అవగాహన లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు. కావున వారికి అవగాహనను కల్పించి, చైతన్యపరచి అభివృద్ధిలోకి తీసుకురావడానికి డిబిఆర్‌సి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన సచివాలయం సెక్రటరీ ఆనంద్‌గారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పెట్టడం వల్ల ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన కలుగుతుంది. అదేవిధంగా మీకు ఎటువంటి అవసరం ఉన్నా సచివాలయంకి వచ్చి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను గురించి తెలుసుకొని, సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా మహిళా పోలీస్ మాట్లాడుతూ మీ ఏరియాలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా మాకు తెలియజేస్తే వాటిని అరికడతామని చెప్పారు. అడ్మిన్స్ సెక్రటరీలు మాట్లాడుతూ మీకు సర్టిఫికెట్లు అయినా, ఇన్కమ్, ఈ-శ్రమ, రేషన్ కార్డులు, ఓటర్ కార్డులు ఏది కావాలన్నా సంబంధిత ఏరియా సచివాలయంకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అ సచివాలయ సిబ్బంది, వేస్ట్ పిక్కర్లు, డిబిఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. *





# ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయాభివృద్ధి పథకాలపై అవగాహనా సదస్సులు

## రైతు సదస్సులు



**పల్నాడు జిల్లా** నరసరావు పేటలో ప్రభుత్వం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కౌలు రైతులకు గ్రామ సభలు ఏర్పాటు చేయాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తిచేసి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. చిన్నప్ప మాట్లాడుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీలు కౌలు రైతులుగా ఉన్నారని, సత్తెనపల్లి మండలంలోని నందిగామలో 150, భట్లూరులో 200, కట్టమూరులో 150 , గోరంట్లలో 50 మంది, ధూళిపాళ్లలో 150 మంది ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు ఉన్నారని తెలిపారు. కౌలు రైతులు అత్యధికంగా ఉన్న గ్రామాల్లో, వ్యవసాయ శాఖ అధికారులు మరియు స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్‌జిఓలు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో గ్రామ సభలు ఏర్పాటుచేసి భూ యజమానులు మరియు కౌలు రైతులకు అవగాహన కల్పించి సిసిఆర్‌సి కార్డులు ఇప్పించి చిన్న, సన్నకారు ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, బ్యాంకు రుణాలు, పిల్లిపెసర, జీలుగు, జనుము 50 % సబ్సిడీపై ఎస్సీ, ఎస్టీ రైతులకు అందేవిధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిబిఆర్‌సి ప్రతినిధులుగా రైతులను చైతన్యవంతం చేయడంలో భాగస్వాములు అయ్యి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందంచి వెంటనే అగ్రికల్చర్ జిల్లా అధికారి మురళికి కౌలు రైతులకు గ్రామ సభల ఏర్పాటు గురించి ఫైల్‌పెట్టి షెడ్యూల్డ్ తయారుచేసి గ్రామ సభలు జరిపించాలని ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో గుండాల మాణిక్యరావు, విప్పర్ల మోహన్, దావల ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సత్తెనపల్లి:** ధూళిపాళ్ళ ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వ పథకాలపై నిర్వహించిన అవగాహనా సదస్సులో పంట సాగుదురుల చట్టం ద్వారా రైతులకు, కౌలు రైతులకు పంట రుణాలు, రైతు భరోసా, ప్రభుత్వ పథకాలు అందించేందుకు సీసీఆర్సీ కార్డులు, ప్రభుత్వం మంజూరు చేస్తుందని జరుగుతుందని సత్తెనపల్లి మడల వెలుగు ఏపీఎం కృపావేణి అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ అభివృద్ధి పథకాలపై అవగాహన సదస్సు సత్తెనపల్లి మండల వెలుగు కార్యాలయం ధూళిపాళ్లలో జరిగింది. ఈ సదస్సుకి డిబిఆర్‌సి ఏరియా కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా డిబిఆర్‌సి గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు, భూ యజమానులు కౌలు రైతులకు చట్టంపై అవగాన కల్పించి కౌలు రైతులకు వీలైన ఎక్కువ మందికి సీసీఆర్‌సీ కార్డులు భూ యజమానులతో మాట్లాడి వారిని ఒప్పించి వాటిని మంజూరు చేయుటకు కృషి చేస్తామని, ఎస్సీ రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారికి ఎస్సీ కార్పొరేషన్ నుండి పది వేల రూపాయలు సబ్సిడీ ఇవ్వడానికి అవకాశాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం వైపు మరల్చడానికి టార్పాలిన్ పట్టలు డ్రమ్ములు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు పూర్తి సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందని దానికి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సత్తెనపల్లి మండల సమాఖ్య అధ్యక్షురాలు శివమ్మ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మరియు మహిళా రైతులు



కులం పునాదుల మీద దేనినీ సాధించలేం.. ఒక జాతిని, నీతిని నిర్మించలేం. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

పంటలను వేసుకునే ముందు భూసార పరీక్షలు చేయించుకుని దాని ద్వారా ప్రతి సంవత్సరం పంటల మార్పిడి చేయడం మూలాన అధిక దిగుబడులు వస్తాయని ఎస్సీ, ఎస్టీ రైతులు మరియు మహిళా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మండలంలోని ఎస్సీ, ఎస్టీ రైతులు, కౌలు రైతులు మరియు మహిళా రైతులు 45 మంది పాల్గొన్నారు.

**కొరిశపాడు: బాపట్ల జిల్లా కొరిశపాడు గ్రామంలో..** దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రైతులకు పంటల సాగుపై ఎస్సీ, ఎస్టీలకు సమావేశం ఏర్పాటు చేశారు. మేదరమెట్లలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎస్.సి. ఎస్.టి. రైతులకు ప్రభుత్వం నుండి లభిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. డిబిఆర్సి ఏరియా కో–ఆర్డినేటర్ పుటిపాటి వీరయ్య మాట్లాడుతూ గతంలో కౌలు రైతులకు దేవాదాయ భూమి సాగుచేసుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేని కారణంగా ప్రభుత్వం స్పందించి ఈ భూములను ఎస్సీ, ఎస్టీ రైతులు సాగుచేసుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన కల్పిస్తూ చైతన్యపరచి వ్యవసాయ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించడానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాలు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు సంఘాల సమైక్య మండల అధ్యక్షులు, దార్ల ఆంజనేయులు పాల్గొన్నారు. *




28.7.2023న ఎఎమ్జీ మీటింగ్ హాలు, నర్సరావుపేట నందు జిల్లా స్థాయి వేస్ట్ పిక్కర్లు మరియు సంచార జాతుల హక్కులు, అభివృద్ధిపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న **డిబిఆర్సి రాష్ట్ర కార్యదర్శి అల్లడి దేవకుమార్** తదితరులు



డిబిఆర్సి ఎన్టీఆర్ జిల్లాలోని అణగారిన ప్రజలకు చేసిన సేవల నిమిత్తము స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా **జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు గారి నుండి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న డిబిఆర్సి రీజనల్ కోఆర్డినేటర్ జామి రమాదేవి**

## డిబిఆర్‌సి ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరాలు

**డిబిఆర్‌సి ఆధ్వర్యంలో ముంబయికి చెందిన స్పార్క్ ఆర్గనైజేషన్ వారి సహకారంతో విజయవాడ మరియు గుంటూరులలో 5 రోజులపాటు మే 5 2023 నుండి మే 9, 2023 వరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు.**

మొదటి రెండు రోజులు విజయవాడలోని కొత్త ఆర్‌ఆర్ పేట మరియు వాంబే కాలనీలో నిర్వహించగా తరువాతి మూడు రోజులు గుంటూరు పరిసర ప్రాంతాలలోని తెనాలి, వెనిగండ్ల మరియు వడ్డేశ్వరంలో నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాలకు ముఖ్య అతిథిగా వచ్చిన విజయవాడ చీఫ్ మెడికల్ అధికారి డా॥ పి. రత్నావళి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా కార్పెంటర్లు, డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు మొత్తం 550 మంది లబ్ధి పొందారు.

డా॥ శ్రీనివాస్ జుకర్ కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మహిళల్లో రక్తహీనత వల్ల ఎక్కువ మంది బాధ పడుతున్నారని తెలిపారు. కార్మికులు మరియు పిల్లలందరికీ మంచి పౌష్టికాహారం అవసరమని తెలియజేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. *







జులై 4, 2023 న షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా 30 మంది దళిత రైతులకు ఒక్కొక్కరికి 2 కేజీల కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న **దర్శి కృషి విజ్ఞాన కేంద్రం డైరక్టర్ డా॥ దుర్గాప్రసాదరావు**



నీకోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు జనంకోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు. - డా॥ బి. ఆర్. అంబేద్కర్




India LABOURLINE 1-800-833-9020

# ఇండియా లేబర్‌లైన్

## ముఖ్య ఉద్దేశ్యం

అసంఘటిత రంగ కార్మికులకు పని వేతనాలు, నష్టపరిహారం, వేధింపులు, పిఎఫ్ / ఈఎస్ఐ / గ్రాట్యూటీ తదితర సమస్యల పరిష్కారం కోసం, ఈ-శ్రమ్, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాల కోసం మరియు శ్రమ లేదా మానవ హక్కుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటును అందించడం.

దీన్ని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ మరియు వర్కింగ్ పీపుల్స్ కొయిలిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

## చేపడుతున్న కార్యక్రమాలు

**ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు -1 800 833 9020:**

- చేసిన పనికి జీతం చెల్లించనప్పుడు.
- పని చేస్తున్న సంస్థలో / ప్రదేశంలో వేధింపులను ఎదుర్కొన్నప్పుడు.
- పని చేస్తున్న సంస్థలో / ప్రదేశంలో మీకు ప్రమాదం జరిగి మీరు నష్టపరిహారం పొందనప్పుడు పైనున్న ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరుకు కాల్‌చేసి సహాయం పొందవచ్చు.

**అవగాహన కార్యక్రమాలు:**

- భవన నిర్మాణ మరియు ఇతర అసంఘటిత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం.

గత సంవత్సర కాలంలో విజయవాడ, గుంటూరు నగరాలలో లేబర్‌లైన్ సుమారు 24,000 మంది అసంఘటిత రంగ కార్మికులను ప్రత్యక్షంగా కలవడం జరిగింది. వీరిలో ఒరిస్సా, బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు కూడా ఉన్నారు. వీరు ప్రధానంగా భవన నిర్మాణ రంగం, లోడింగ్ అన్‌లోడింగ్ ముఠా కార్మికులు, హోటల్ హెల్పర్లు, స్పిన్నింగ్ మిల్స్, క్వారీ, మట్టి పని తదితర పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

లేబర్‌లైన్ గుంటూరు, విజయవాడ నగరాల్లో మొత్తం 60 లేబర్ అడ్డాలను గుర్తించి కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. సంవత్సర కాలంలో 93 మంది కార్మికులు తమ సమస్యలను లేబర్ హెల్ప్‌లైన్ నందు నమోదు చేసుకోగా, 24 దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను లేబర్‌లైన్ బృందం పరిష్కరించింది. వేతనాలు మరియు నష్టపరిహారానికి సంబంధించి సుమారు రూ. 20,00,000/- లు కార్మికులకు వారివారి యజమానుల నుంచి ఇప్పించడంలో లేబర్‌లైన్ బృందం ప్రముఖపాత్ర పోషించింది.

ఈ కార్యక్రమలో భాగంగా కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తున్న కార్మికశాఖ, పి.ఎఫ్. మరియు ఇ.ఎస్.ఐ. విభాగాలు, జిల్లా న్యాయసాధికార తదితర సంస్థల సమన్వయంతో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది. *

# దళిత ఆదివాసీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహనా సదస్సులు




దర్శి కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న పశువైద్యాధికారిణి **డా॥ లీలాకృష్ణ.** వేదికపై **హోం సైన్స్ శాస్త్రవేత్త డా॥ మానస, సస్యరక్షణ విభాగ శాస్త్రవేత్త డా॥ ఉష** తదితరులు

**పల్నాడు జిల్లా, ముప్పాళ్ళ మండలం** చాగంటి వారి పాలెం రైతు భరోసా కేంద్రంలో మండలస్థాయి సమావేశం డిబిఆర్‌సి కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షతన డిబిఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం బాలస్వామి మాట్లాడుతూ, ఎస్‌హెచ్‌జి శ్రీనిధి, ఉన్నతి లోన్లను తీసుకుని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొని కుటుంబ అభివృద్ధికి ప్రయత్నం చేయాలని, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు మరియు లోన్స్ పొంది, వ్యాపార పరంగా పెట్టుబడిగా పెట్టుకుని అభివృద్ధి చెందితే కుటుంబం అంతా బాగుంటుంది అని, పిల్లలకు చదువు ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుంది అని, మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని వచ్చిన అవకాశాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలని కోరారు. మేడే వెంకటరమణ మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ద్వారా లోన్లు ఎస్సీ, ఎస్టీలకు 35% సబ్సిడీతో లోన్లు ఇస్తున్నారని మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుచేసుకునే వారికి ఈ అవకాశం బాగుంటుందని, చదువుకొని ఖాళీగా ఉన్న యువత ప్రభుత్వం ఇచ్చే ట్రైనింగ్స్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు నాగమల్లేశ్వరరావు, భాను, రాములమ్మ, రమణ మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా, దర్శి మండలం, సామంతపూడి గ్రామం రైతు భరోసా కేంద్రంలో దళిత ఆదివాసీ మహిళలకు సంక్షేమ అభివృద్ధి పథకాలపై అవగాహన సదస్సు దర్శి కో–ఆర్డినేటర్ గుంటూరు నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. వహించారు. ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది ఏఎన్ఎం విశాలాక్షి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధనలక్ష్మి, మహిళా పోలీస్ రమ్యప్రియ, వివోఏ. సిపోరా, అంగన్వాడీ టీచర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధనలక్ష్మి మాట్లాడుతూ జగనన్న హౌస్ సైట్స్ గురించి కాలనీలు కట్టుకునే వారికి అప్లికేషన్ పెట్టుకుంటే వారికి బిల్లులు గురించి వివరించి ఎలా అప్లై చేసకోవాలో తెలిపారు. రమ్యప్రియ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను దిశ యాప్ ద్వారా అత్యాచారాలపై, గృహ హింసపై అవగాహన కల్పించడం వల్ల ఆ సమస్యలను ఎలా ఎదుర్కోవాలో, సమాచారం ఎవరికి ఇవ్వాలో దానిపై ఉన్న అవకాశాలపై క్లుప్తంగా వివరించారు. ఏ ఎన్ఎం విశాలాక్షి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుంటే పిల్లల తల్లులు త్వరగా అనారోగ్యం బారినపడతారని, అందరూ చదువుకొని అభివృద్ధి చెందినట్లయితే సమాజంలో మంచి గౌరవం హోదా వస్తాయని తెలిపారు. పిల్లల్ని చదివించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, చదువు చాలా గొప్పది అని, అందరూ పరిశుభ్రంగా ఉండాలని, మంచి ఆహారాన్ని తినాలి అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి అని




తెలిపారు. తదుపరి వీవోఏ సిపోరా మాట్లాడుతూ గ్రామంలో స్త్రీ నిధి, ఉన్నతి ద్వారా ఎన్నో అవకాశాలు ఉన్నాయని, గ్రూపులలో ఉన్న వారు సక్రమంగా లోన్లు, రుణాలు కట్టుకున్నట్లయితే సున్నా వడ్డీకి రుణాలు పొందవచ్చని, స్త్రీ నిధి ద్వారా ఒక్కొక్కరికి రూ. 50 వేల రూపాయల రుణం పొందవచ్చని తెలిపారు. ఉన్నతి ద్వారా గేదెలు, గొర్రెలు, కోళ్లు, మరియు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకోవచ్చని, లక్ష నుండి 20 లక్షల వరకు లోన్ పొందవచ్చని, బేకరీలు, విస్తరాకులు, పచ్చళ్ళ తయారీ యూనిట్లు వంటివి పెట్టుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి 38 మంది మహిళలు పాల్గొన్నారు.

**బాపట్ల జిల్లా** కొరిశపాడు మండలం రావినూతల గ్రామం అంబేద్కర్ భవన్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఏరియా కో–ఆర్డినేటర్ పులిపాటి వీరయ్య అధ్యక్షతన దళిత ఆదివాసి మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు శాఖలవారీగా అందుతున్న పథకాలపై గ్రామ సచివాలయ అధికారులు ప్రభుత్వ సేవల గురించి వివరించారు. స్వయం సహాయక బృందాల ప్రతినిధి చంద్రకళ మాట్లాడుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ సంస్థల సేవల గురించి విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ కె. రాణి మాట్లాడుతూ మహిళ వ్యవసాయ రైతులు రాయితీలను పొంది అభివృద్ధి చెందాలన్నారు. గ్రామ పోలీస్ పి. వెంకట రమణమ్మ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల దృష్ట్యా జాగ్రత్త వహించాలని అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే మా దృష్టికి తీసుకొస్తే తక్షణమే సమస్య పరిష్కారానికి పనిచేస్తామన్నిరు. ఏఎన్ఎం జి. కృష్ణవేణి మాట్లాడుతూ గ్రామంలోని వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ప్రతికూల పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేవిధంగా ప్రణాళికలను సిద్ధం చేసుకుని ప్రజలకు సేవ అందిస్తున్నామని, అదేవిధంగా ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు. కాలనీ ప్రతినిధి పంచాయతీ బోర్డు మెంబర్ గాలి సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీలో యువతీ యువకులు బాగా చదువుకుని సరైన ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారని, ఈ ప్రాంతంలో సరైన విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటుచేస్తే పోటీ పరీక్షలకు తయారయ్యి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తారని అన్నారు. యూత్ లీడర్ పులిపాటి గౌరీ శంకర్ మాట్లాడుతూ నేటి సమాజంలో యువత టెక్నాలజీలో మెలకువలను కలిగి ఉండి మంచి భవిష్యత్తుకు మార్గాన్ని అన్వేషిస్తున్న తీరుకు ప్రభుత్వాలు ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి. వెంకటలక్ష్మి, ఆశ వర్కర్లు బొట్టు పార్వతి, బెజ్జం సునీత, కొండ్రు సుజాత, ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు** లోని స్థానిక ఐ.కె.పి. కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మహిళలు ప్రభుత్వ పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఏ.పీ.ఎం. సుబ్బారావు వివరించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన పెంపొందించుకుని పురోగతి సాధించాలన్నారు. మహిళలకు డ్వాక్రా, స్త్రీనిధి, సంక్షేమ పథకాల ద్వారా నగదు జమ చేయడం జరుగుతుందని, వాటి ద్వారా చిరు వ్యాపారులతోపాటు పాడి పరిశ్రమ, నాటు కోళ్ళు పెంపకం వంటివి చేసుకోవాలని సూచించారు. తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని సూచించారు. బ్యాంకు ద్వారా తీసుకున్న డ్వాక్రా రుణాల ను సకాలంలో చెల్లింపులు జరపాలన్నారు. కార్యక్రమంలో డీబీఆర్సి సమన్వయకర్త భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. *

# మహిళలకు నాయకత్వ లక్షణాలపై శిక్షణా తరగతులు

• మహిళల సాధికరత తోనే సమాజాభివృద్ధి • ప్రతి మహిళా నాయకురాలిగా ఎదగాలి • రాజ్యాంగం కల్పించిన హక్కులను, అవకాశాలను పొందాలి • మహిళలు చైతన్యం చెందితే కుటుంబం, పిల్లలు అభివృద్ధి చెందుతారు.



**దళిత బహుజన రిసోర్స్ సెంటర్** ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మహిళా నాయకులకు రెండు రోజులు నాయకత్వ లక్షణాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుండి మహిళా నాయకులు 55 మంది పాల్గొన్నారు.

ఈ సమావేశంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ డైరక్టర్ అల్లడి దేవకుమార్ మాట్లాడుతూ, దళిత బహుజనుల కలలు సాకారమయ్యేందుకు వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను, అవకాశాలను అనుభవించగలిగే సమాజాన్ని సృష్టించడమే డిబిఆర్‌సి లక్ష్యం అని, అందుకొరకు మహిళలకు నాయకత్వ లక్షణాలపై శిక్షణా తరగతులను ఏర్పాటు చేశామని తెలిపారు.

రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన జగదీష్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు చాలా శక్తిమంతులని, పుట్టుకతో ఎవరూ నాయకులు కాదని, పెరిగిన సమాజం, పరిస్థితుల నేపథ్యంలో నాయకులుగా మారుతారని అన్నారు. నాయకులు కావాలంటే ఎదుటివారికి సహాయం చేసే మనస్సు ఉండాలని, అందరికీ సమానంగా చూడాలని, నాయకులుగా ఉండాలి అనే సంకల్పం ఉన్నవారు మాత్రమే నాయకులుగా గుర్తించ బడతారని అన్నారు. శిక్షణలో పాల్గొన్నవారు తెలసుకున్న సమాచారాన్ని ఇతరులకు తెలియ జేయాలని అప్పుడు ఆ సమాచారం ఇతరులకు కూడా ఉపయోగపడుతుందని వివరించారు. ఎవరైనా మన దగ్గరకు వచ్చి వారి సమస్యను చెప్పినప్పుడు ఆ సమస్యను పరిష్కరించేలా మనము ప్రయత్నం చేయాలని, ఆ సమస్య పరిష్కారమైన అయినా కాకపోయినా వారికి సరైన సమాచారాన్ని అందించినప్పుడు వారికి మన మీద గౌరవం పెరుగుతుందని అన్నారు.

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ హేమమలత మాట్లాడుతూ, డిబిఆర్‌సి గత 30 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ కులాల వారి సాధికారత కొరకు పని చేస్తుందని, మహిళలు, చిన్న పిల్లల కొరకు ప్రధానంగా పనిచేస్తుందని అన్నారు. ఏ సమాజం అయినా అభివృద్ధి చెందిందా అనే దానికి ఆ సమాజంలోని మహిళలు సాధించిన అభివృద్ధి తోనే కొలుస్తాను అనే బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలను దృష్టిలో పెట్టుకొని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పని చేస్తుందని అందుకోసం ప్రతి జిల్లాలో మహిళా నాయకులకు శిక్షణా తరగతులు ఏర్పాటుచేసి వారిని నాయకులుగా తీర్చిదిద్దే దిశగా డిబిఆర్‌సి ప్రయత్నం చేస్తుందని అన్నారు. **ఈ శిక్షణా కార్యక్రమానికి ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం మరియు బాపట్ల జిల్లాల నుండి మహిళా నాయకులు పాల్గొన్నారు.** *





ఆశయాలను ఆచరణలో పెడితే మనిషి మహనీయుడు అవుతాడు. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

# నైపుణ్యం తోనే ఉపాధి అవకాశాలు

**- అల్లడి దేవకుమార్**

**దళిత బహుజన రిసోర్స్ సెంటర్** ఆధ్వర్యంలో యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరియు సవాళ్లు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు గుంటూరు, బ్రాడీపేట లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. **దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్సి) ఎగ్జిక్యూటివ్ సెక్రటరి అల్లడి దేవకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో దేవకుమార్ మాట్లాడుతూ,** దళిత యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. జీవనోపాధుల్లో మార్పులు సంభవిస్తున్నాయని, ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల నుండి చదువుకున్న యువకులు దానికి అనుగుణంగా మార్పు చెందాలని అన్నారు. ప్రభుత్వ రంగంలో రోజురోజుకీ ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్న తరుణంలో ప్రైవేటు రంగంలో పెరుగుతున్న అవకాశాలను గమనించి స్థిరపడాలని సూచించారు.

**గుంటూరు జిల్లా ఉపాధి కల్పనాధికారి రమాదేవి మాట్లాడుతూ,** నిరుద్యోగ యువతీ యువకుల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక కార్యక్రమాల ను నిర్వహిస్తున్నామని ఆయా జిల్లాలలో ప్రాంతాల వారీగా జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లా అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి వి.సి.హెచ్. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులలో నైపుణ్యాలను అభివృద్ధిచేసే దిశగా ఎంపిక చేసిన కళాశాలలో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేస్తామని వీటి ద్వారా వివిధ రకాల కోర్సులు చదివే విద్యార్థులతో పాటు నిరుద్యోగులు ఈ కోర్సులను నేర్చుకుని ఉపాధి దిశగా అడుగులు వేయాలని అన్నారు.



ఆగస్టు 8న గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, గుంటూరులో నిర్వహించిన **"యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరియు సవాళ్లు"** అనే అంశంపై అల్లడి దేవకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న **గుంటూరు జిల్లా సహాయ ఉపాధి కల్పనాధికారి కె. రమాదేవి గారు.** వేదికపై ఏరియా కో-ఆర్డినేటర్ **భగవాన్‌దాస్,** హిందూ కళాశాల అధ్యాపకులు డా॥ చుక్క నవీన్ కుమార్, డిబిఆర్సి రాష్ట్ర కార్యదర్శి అల్లడి దేవకుమార్, జిల్లా అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి సి.హెచ్. ప్రసన్నకుమార్, వ్యాపారవేత్త రాజేష్ పిళ్ళా గార్లు.



**హిందూ కళాశాల అధ్యాపకులు డా॥ చుక్క నవీన్ కుమార్ మాట్లాడుతూ** నేటి యువతీ యువకులు తాము ఉన్న ప్రాంతంలోనే ఉపాధి దొరకాలి అనే ఆలోచనలలో కాకుండా ఎక్కడ అవకాశాలు ఉంటే అక్కడికి వెళ్ళి ఉద్యోగం చేసుకునేలా ఆలోచించాలి అని అన్నారు. పోటీ ప్రపంచానికి తగిన విధంగా యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ పనిచేస్తోందని అన్నారు. నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకొని వ్యసనాల్ని విడిచి విజేతలుగా నిలవాలని సూచించారు. యువత సెల్ ఫోన్లు ఎక్కువగా వాడుతున్నారని, మనకు ఉన్న సమయాన్ని ఎక్కువ సమయం కొత్త టెక్నాలజీని నేర్చుకునేలా కేటాయించాలని, తద్వారా పోటీ ప్రపంచంలో మనకూ ఒక స్థానం ఉంటుందని అన్నారు.



**వ్యాపారవేత్త రాజేష్ పిళ్ళా మాట్లాడుతూ** యువత వ్యాపారాలు చేసే దిశగా ఆలోచించాలని అన్నారు. ఈ క్రమంలో ఆ వ్యాపారం యొక్క లోతుపాతులను అధ్యయనం చేయాలని అన్నారు. ఎవరైనా పుట్టుకతో గొప్పవాళ్ళు కాదని, తాను అనుకుంటే సాధించలేనివి ఏమీ లేదని, ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని అనుకొని, అది సాధించేందుకు తగిన ప్రణాళిక ఏర్పరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు, సదస్సు సమన్వయకర్త వి. భగవాన్ దాస్, డిబిఆర్సి ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మి, ప్రతినిధులు కస్తూరి, శశిధర్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు. *

దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి. - డా॥ బి. ఆర్. అంబేద్కర్



# వేస్ట్ పిక్కర్ల జీవితానికి భరోసా ఇచ్చిన డిబిఆర్‌సి

**చెత్త కాగితాలు ఏరుకొని జీవించే వేస్ట్ పిక్కర్లు ఏ స్థిర నివాసం లేక ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే అక్కడ తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తూ ఉండేవారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న తాడేపల్లి దగ్గర ఇప్పటం గ్రామంలో ఉన్న వేస్ట్ పిక్కర్లు సుమారు మూడు సంవత్సరాల ుగా రైల్వేట్రాక్ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో నివాసం ఏర్పాటు చేసుకొని నివశిస్తున్నారు.**

కానీ అది ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన ఆస్థి కావడం వల్ల వారు తరచూ వచ్చి వేస్ట్ పిక్కర్స్‌ని ఆ ప్రదేశం వదలి వెళ్లాలని ఒత్తిడి చేస్తూ ఉన్నందున ఏమి చేయాలో తెలియక ఆయోమయ స్థితిలో ఉన్న వారు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వారి దృష్టికి తమ సమస్యలను తీసుకొని వచ్చి వివరించడం ద్వారా డిబిఆర్‌సి ప్రతినిధులు ఈ అంశాన్ని స్థానిక సచివాలయం సిబ్బందికి తెలియజేసి వారికి సహాయం చెయ్యాలని అడుగగా దగ్గర్లోనే ఉన్న ఖాళీ ప్రదేశంలో వేస్ట్ పిక్కర్లకు తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకునే అవకాశం ఇచ్చారు. 2014 కు ముందు కృష్ణానది ఒడ్డున నివాసం ఉండేవారు. అప్పట్లో దేవాలయాలకు సంబంధించిన అధికారులు వచ్చి గుడి ముందు మీ ఇల్లేమిటంటూ తొలగించారు. ఆ తరువాత రైల్వేబ్రిడ్జి క్రింద పుష్కర ఘట్ల వద్ద గుడిసెలు వేసుకున్నాం. పుష్కరాల పేరుతో వాటినీ తొలగించారని, అనంతరం కొలనుకొండ దగ్గర రోడ్డు వెంబడ గుడిసెలు వేసుకంటే అక్కడా తీయించేశారు ఇప్పుడు వడ్డేశ్వరం రైల్వేట్రాకు దగ్గరకు రాగా ఇక్కడ నుండి కూడా పోలీసుల సహకారంతో తరిమేశారని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో డిబిఆర్‌సి మాకు ఆ స్థలంలో ఇళ్లు ఏర్పాటు చేసుకోవటానికి అవసరమయిన కర్రలు మరియు టార్పాలిన్ పట్టలు డిబిఆర్‌సి సంస్థ ద్వారా ఇవ్వడం, త్రాగడానికి మరియు వాడుకోవడానికి నీళ్ళు లేకపోవడం వల్ల వాళ్లు నీళ్ళు తీసుకోవడానికి రైల్వే ట్రాక్ దాటి అవతలవైపుకి వెళ్లి నీళ్ళు తీసుకుని వచ్చేవాళ్లు. అది చూసిన డిబిఆర్‌సి సమస్య గుర్తించి వారికి బోరింగ్ పంపు వాళ్ళు ఉన్న స్థలంలో వేయించారు.

తదనంతరం అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇళ్ళ స్థలాలు/ఇల్లు కార్యక్రమంలో వేస్ట్ పిక్కర్ల అందరిచేత ఇళ్ల పథకానికి దరఖాస్తు చేయించడం వల్ల ఇప్పుడు దాదాపు 26 కుటుంబాలకు ఇళ్ళు మంజూరు అయ్యాయి. ఇప్పుడు ఆ 30 కుటుంబాల్లో ఉన్న 25 మంది పిల్లలకు ఆధార్ కార్డులు తీయించడం వల్ల వారు బడికి పోతున్నారు. సాయంత్రం సమయంలో వారికి చదువుపై ఆసక్తిని పెంచడానికి ఓఎల్‌సీలను స్థాపించడం వల్ల పిల్లలు బాగా చదువుకుంటున్నారు. అక్కడ వారికి చదువుతో పాటు ఆటలు, పాటలు మొదలైన అహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం వల్ల పిల్లలు చాలా సంతోషంగా వున్నారు.



యాటగిరి తిరుపతమ్మ

**ఎంతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న మాకు సమాజంలో మమ్మల్ని కూడా మనుషులుగా గుర్తించి అందరిలాగా మాకు అన్ని అవకాశాలు అందిపుచ్చుకునేలా కృషి చేసిన డిబిఆర్‌సి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాము.**



ఎకవేరి హరికృష్ణ

**మేము గత 3 సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నాము. మా చుట్టుపక్కల జనం మమ్మల్ని హీనంగా చూస్తూ అవమానిస్తూ ఉంటే ఆ బాధను ఎవరికీ చెప్పుకోలేక మాలో మేమే రోజూ ఏడుస్తూ బ్రతుకుతున్న సమయంలో డిబిఆర్‌సి మా వద్దకు వచ్చి చేదోడుగా ఉండి మాకు కనీస అవసరాలైన తిండి, గుడ్డ, గూడు అందించడం కోసం చాలా ప్రయత్నం చేసి అవి మాకు అందేలా కృషి చేసింది.**



రసిగిరి రోశమ్మ

**మా పిల్లలు సరైన గుర్తింపు కార్డులు లేక చదువుకోవటానికి అవకాశాలు లేని పరిస్థితుల్లో డిబిఆర్‌సి వారు మమ్మల్ని ఆదుకొని మా జీవితాలకు వెలుగులు ఇచ్చారు. మా పిల్లలు కూడా అందరి పిల్లలు లాగే బాగా చదువుకొని ప్రయోజకులు అయ్యేందుకు ప్రయత్నం చేస్తున్న డిబిఆర్‌సి కృతజ్ఞతలు**

వేస్ట్‌పిక్కర్లకు జీవనోపాధిని పెంపొందించడం కోసం మూడు చక్రాల బల్లబండ్లు అందించడం వల్ల వారి ఆదాయాలు గతంలో కంటే ఇప్పుడు మెరుగ్గా వున్నాయని ఆనందంగా ఉన్నారు. చెత్త సేకరించిన తరువాత అది కొనే స్క్రాప్ షాప్ వాళ్లు తక్కువ డబ్బులు ఇస్తున్నారని తెల వడంతో డిబిఆర్‌సినే వారి ఆదాయాన్ని పెంచడం కోసం స్క్రాప్ షాప్‌ను ఏర్పాటుచేసి వారి ఆదాయం పెరగటంలో సహాయపడుతుంది. *



ఆశయాలను ఆచరణలో పెడితే మనిషి మహనీయుడు అవుతాడు. - డా॥ బి. ఆర్. అంబేద్కర్

# 4 దశాబ్దాల క్రితం చేజారిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న దళితులు
# అండగా నిలిచిన డిబిఆర్‌సి బృందం



రైతులకు భూ పట్టాలు అందేలా చేయమని ప్రస్తుత మండల తహాశీల్దార్ శ్రీ నయీం గారికి వినతిపత్రం ఇస్తున్న డిబిఆర్‌సి ప్రతినిధి మరియు రైతులు.

**ప్రకాశం జిల్లా** ముండ్లమూరు మండలం ముండ్లమూరు పంచాయతీ లోని వేంపాడు గ్రామంలో ఎస్సీ మాల, మాదిగ కులాలకు చెందిన గండి రమేష్, గండి ఏసోబు, గండి గురవయ్య, గండి వీరయ్య, గోపన బోయిన ఏడుకొండలు, గోపబోయిన పెద్ద బాపనయ్య, గోపనబోయిన ఆదిశేషు, గోపనబోయిన శివ, గోపనబోయిన చిన్న బాపనయ్య నివశిస్తున్నారు. వారు సాగు చేసుకుంటున్న ఐదు ఎకరాల అనాధీనం భూమిని అగ్ర కులానికి చెందిన భూస్వాములు దళిత కులస్తులపై దౌర్జన్యం చేసి వారు సాగుచేసుకుంటున్న భూమిని ప్రభుత్వ అధికారుల అండదండలతో తప్పుడు ధృవపత్రాలు సృష్టించి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు.

ఈ విషయంలో ఎవరిని సహాయం అడగాలో తెలియక అంతుచిక్కని పరిస్థితిలో గత 40 సంవత్సరాలుగా మానసిక వేదనను అనుభవిస్తున్న ఆ రైతులకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ చేస్తున్న కార్యక్రమాలను గురించి తెలుసుకుని వారి దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ అంశంపై డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు భూమి యొక్క వివరాలు గురించి సమగ్ర సమాచారం సేకరించి, విచారించగా ఆ పొలం దళిత కులస్తులైన మాల, మాదిగలదే అని నిర్ధారించుకుని సంబంధిత అధికారుల వద్దకు వెళ్ళి సమస్య పరిష్కారం కొరకు ప్రయత్నం చేశారు. ఆ పొలానికి సంబంధించిన అడంగల్ రికార్డును గ్రామ సచివాలయం నందు వివరాలు తీయగా అది అనాధీనం భూమిగా నిర్ధారణ అయింది. అయితే ఆ భూమికి సంబంధించిన హక్కు పత్రాలు తమ పూర్వీకుల పేరు మీద ఉన్న సంగతి తమకు తెలియనందు, గత ఆరు నెలల కాలనీలో ఈ భూమికి సంబంధించిన సర్వే నంబరు 181/6. 192/2. 195/5 నంబర్లుగా గుర్తించి మాల, మాదిగల కులస్తుల పేర్లు మీద ముండ్లమూరు తహసీల్దార్ స్పందనలో అర్జీ ఇచ్చి అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు.

అనంతరం ఈ అర్జీపై అధికారులు సంబంధిత పత్రాలను సేకరించి పరిశీలించగా ఆ భూములు దళితులకే చెందుతాయని అధికారులు నిర్ధారణకు వచ్చి ఆ పొలాలకు సంబంధించిన ఆన్లైన్ ప్రక్రియ దళితుల పేరుమీదనే జరిపించాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మరియు ఆ భూమి లోకి అగ్రవర్ణాలవారు ప్రవేశించవద్దని, దళితులకు ఏ అపాయం కల్గించవద్దని అగ్రవర్ణాల వారికి తెలియజేశారు. ఆ భూమికి సంబంధించిన హక్కు పత్రాలను అసైన్మెంట్ కమిటీలో పెట్టి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేస్తామని, మండల తహసీల్దార్ శ్రీమతి యం. ఉషారాణి ఎస్సీ రైతులకు తెలియజేశారు.

గత 40 సంవత్సరాలుగా పోరాటం చేస్తూ సాధించుకోలేని ఆ భూమిని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలోనే ఆ భూమికి అగ్ర కులస్తుల నుంచి ఎలాంటి వివాదం లేకుండా పరిష్కారం చేసిన డిబిఆర్‌సి కృషిని రైతులు, గ్రామస్తులు అభినందించారు. పొలం తిరిగి పొందిన దళిత రైతులు గండి రమేష్, గండి ఏసోబు, గండి వీరయ్య, గండి గురవయ్య, గోపనబోయిన ఏడుకొండలు, గోపనబోయిన పెద్ద బాపనయ్య, గోపనబోయిన ఆదిశేషు, గోపనబోయిన రామకృష్ణ, గోపనబోయిన శివ ఆనందం వ్యక్తపరుస్తూ డిబిఆర్‌సికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు. *



**డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతి** సందర్భంగా గుంటూరు లోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డిబిఆర్‌సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరుదైన చిత్రాల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ **శ్రీ వి. వేణుగోపాల్‌రెడ్డి** గారు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు **గౌ॥ బసవయ్య** గారు, సంయుక్త కలెక్టర్ **గౌ॥ బి. రాజకుమారి** గారు తదితరులు.



జులై 31, 2023 న డిబిఆర్‌సి కార్యాలయంలో వేస్ట్ పిక్కర్ల పౌష్టికాహార మరియు ఆరోగ్య సమస్యలపై డా॥ చిక్కాల నాగరాజు, డా॥ వై. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిబిఆర్‌సి నిర్వహించిన అధ్యయన నివేదికను విడుదల చేస్తున్న రిటైర్ట్ ఐ.ఎ.ఎస్. అధికారి **టి. గోపాలరావు**, రిటైర్ట్ **ఐఆర్‌టిఎస్ అధికారి పనబాక కృష్ణయ్య** గార్లు


**దళిత బహుజన రిసోర్స్ సెంటర్**

డోర్.నం. 4-16-25/6, బండ్లమూడి కాంప్లెక్స్, 4వ లైను, భారత్‌పేట, అమరావతి రోడ్, గుంటూరు-522 002.

ఫోన్: 0863-2254271 | ఇ-మెయిల్: apdbrc@gmail.com